కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :150 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | గురువారం 01-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## మాజీ డీఎస్పీ భీమ్ రెడ్డికి ఐటీ శాఖ షాక్..

హైదరాబాద్, అక్రమాస్తుల కేసులో సస్పెండ్ అయిన మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి వ్యవహారంలో ఆదాయపన్ను (IT) శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. భీమ్ రెడ్డికి చెందిన 8 మంది బినామీలపై కేసు నమోదు చేసింది. అయితే దేశంలోనే బినామీపై ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఐటీ శాఖ ప్రాసెక్స్ నిబంధనల ప్రకారం 'బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్స్ యాక్ట్ కింద ఈ కేసులు నమోదు చేశారు.

ఏసీబీ సోదాలతో బయటపడ్డ బినామీలు:

గతంలో ఏసీబీ నిర్వహించిన సోదాల్లో భీమ్‌రెడ్డికి సంబంధించి వందల కోట్ల విలువైన అక్రమాస్తులు, నకిలీ ధృవపత్రాలు లభ్యమయ్యాయి. ఈ దర్యాప్తును మరింత వేగవంతం చేసిన అధికారులు, ఆయన అక్రమ సంపాదనను బినామీల పేరిట రియల్ ఎస్టేట్ మరియు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులుగా మళ్లించినట్లు ఆధారాలు సేకరించారు. హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు పలు ప్రాంతాల్లోని 8 మంది బినామీల ఇళ్లపై ఇటీవల దాడులు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

రూ. వందల కోట్ల ఆస్తులు జప్తు చేసే అవకాశం:



ఐటీ శాఖ నమోదు చేసిన ఈ కేసు ఆధారంగా భీమ్‌రెడ్డి బినామీల పేరిట ఉన్న ప్లాట్లు, విల్లాలు, ఫ్లాట్లు మరియు ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్లను జప్తు చేసేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఈడీ కూడా మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. ఐటీ శాఖ నేరుగా బినామీ చట్టం కింద కేసు నమోదు చేయడంతో భీమ్‌రెడ్డి బినామీ నెట్‌వర్క్‌కు గట్టి షాక్ తగిలినట్లయింది.

## ఇండియా కూటమి భేటీలో ఖర్గే ఆరు డిమాండ్లు..

న్యూఢిల్లీ, ఎస్ఐఆర్ లో జరిగిన అవకతవకలపై ఉమ్మడి ఆందోళన కోసం కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడానికి, భారత కూటమి అగ్ర నాయకులు బుధవారం జాతీయ రాజధానిలో సమావేశమయ్యారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి ప్రతిపక్షం ఐక్యంగా నిలుస్తుందని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ సమావేశంలో, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరు డిమాండ్లను చేశారు. వాటిలో మొదటిది, భవిష్యత్ ఎన్నికలకు ఎస్ఐఆర్ కు ముందున్న ఓటర్ల జాబితానే ఉపయోగించాలని ఆయన అన్నారు. "ప్రతి ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత ఉండాలి. చేర్పులు, తొలగింపులు, సవరణలపై నియోజకవర్గాల వారీగా, బూత్‌ల వారీగా సమాచారం అందించాలి," అని ఆయన అన్నారు.

ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ల ద్వారా ఓటింగ్

రెండవది, ఏ అర్హత గల ఓటరునైనా జాబితా నుండి తొలగించే ముందు, వారికి సరైన నోటీసు, కారణాలు మరియు సమర్థవంతమైన అప్పీల్ యంత్రాంగాన్ని విడుదల చేయాలని ఆయన అన్నారు. మూడవది, పరిపాలనా వైఫల్యాలు, సరైన పత్రాలు లేకపోవడం లేదా అవగాహన లోపం వల్ల జరిగే బహిష్కరణల నుండి అర్హులైన ఓటర్లను రక్షించాలని ఆయన అన్నారు. నాల్గవది, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ల ద్వారా ఓటింగ్ ను తప్పనిసరి చేయాలని ఆయన అన్నారు. ఐదవదిగా, యువ పౌరులకు, ముఖ్యంగా తొలిసారి ఓటు వేసేవారికి, సులభమైన మరియు అందుబాటులో ఉండే ఓటరు నమోదును తప్పనిసరి చేయాలని ఆయన అన్నారు.

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది

ఆరవదిగా, రాజకీయ వర్గాలన్నిటిపై విశ్వాసం ఉంచిన ఎన్నికల సంఘం నుండి సంస్థాగత జవాబుదారీతనం ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రతి పౌరుడికి సమాన వాణి ఉండాలి: ఖర్గే తన ప్రారంభోప




న్యాసంలో ఖర్గే మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, దీని ప్రజాస్వామ్య సంప్రదాయాలు ఒక సరళమైన కానీ లోతైన సూత్రంపై నిర్మించబడ్డాయని, ఆ సూత్రం ప్రకారం ఈ దేశ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రతి పౌరుడికి సమాన వాణి ఉండాలని అన్నారు. ఇదే భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అని ఆయన జోడించారు. దేశవ్యాప్తంగా, ఎన్నికల సంఘం పనితీరుపై పౌరులు, రాజకీయ పార్టీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. "సంవత్సరాలుగా, మేము ఈవీఎంలపై సమాధానాలు కోరుతున్నాము. ఓటర్ల జాబితా అవకతవకలు, ఓటర్ల జాబితాలో వివరణ లేని మార్పులపై మేము ప్రశ్నలు లేవనెత్తాము. మహాదేవపుర, ఆలంద్, హర్యానా మరియు మహారాష్ట్రలలో ఇది జరిగిందని రాహుల్ జీ ఆధారాలతో చూపించారు. అదే విధంగా ఇండియా గ్రూపులోని పార్టీలన్నీ ఈ విషయంలో ప్రశ్నలు, అభ్యంతరాలు లేవనెత్తాయి. కానీ అయ్యో, అన్నీ వృధా అయ్యాయి," అని ఆయన విచారం వ్యక్తం చేశారు.

## రేవంత్ రెడ్డి కేవలం రిబ్బన్ కటింగ్ సీఎం మాత్రమే!



హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలోని బిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేసీఆర్ మార్క్ చెరపడం ఎవరి తరమూ కాదు

రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ఈ రోజు అదే కేసీఆర్ హయాంలో నిర్మించిన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. అసలు ఈ కలెక్టరేట్ నిర్మాణంలో రేవంత్ రెడ్డి పాత్ర ఏముందో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ కట్టిన సచివాలయం, ఆస్పత్రులు, కలెక్టరేట్లే నేడు రాష్ట్రంలో కనిపిస్తున్నాయని, రేవంత్ రెడ్డి కేవలం రిబ్బన్ కటింగ్ ముఖ్యమంత్రిగానే మిగిలిపోతారని విమర్శించారు.

కొడంగల్‌లో కనీస అభివృద్ధి ఏది?

గత పదేళ్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధిలో కనీసం 10 శాతం అభివృద్ధి అయినా రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో చూపించాలని సవాల్ విసిరారు. సొంత నియోజకవర్గంలో విద్యుత్ కోతల వల్ల ప్రజలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని, అక్కడ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ భవన్‌కు వస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సిరిసిల్ల సభకు జనం రాక ఇతర జిల్లాల నుండి జనాలను తరలించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

## ఆసియా క్రీడల్లో స్వర్ణం.. చికిత,సాహిల్‌కు సీఎం రేవంత్ అభినందనలు



హైదరాబాద్, సెప్టెంబర్ 30: ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన చికిత, సాహిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది. మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో చికిత-సాహిల్ జోడీకి గోల్డ్ వరించింది. దీంతో ఒకేరోజు రెండు స్వర్ణాలు సాధించిన చికిత.. 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల్లో సర్ణం సాధించిన పెద్దపల్లికి చెందిన చికిత ప్రతిభపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. చికిత విజయం తెలంగాణ క్రీడా చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. చికిత పట్టుదల క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.కాగా.. ఆసియా క్రీడలు 2026లో కాంపౌండ్ ఆర్చరీలో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చికిత, సాహిద్ జోడి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకుంది. ఈరోజు(బుధవారం) జరిగిన ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన పార్క్ జంగ్యూన్, చోయ్ యోంగ్‌హీ జోడీని షూట్‌ఆఫ్‌లో ఓడించి చికిత, సాహిల్ జోడి స్వర్ణం సాధించింది. ఫైనల్‌లో 157-157తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు షూట్‌ఆఫ్ నిర్వహించారు. ఈ సమయంలో చికిత, సాహిల్ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బుల్స్‌ఐని కొట్టడంతో భారత్ ఖాతాలోకి మరో పసిడి వచ్చి చేరింది.

### తెలంగాణ కేబినెట్ భేటీ.. డీఏలపై కీలక నిర్ణయం!

హైదరాబాద్,మంత్రివర్గ సమావేశాన్నినిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి భేటీ కాబోతోంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలు, సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

ఉద్యోగులకు డీఏ ఆమోదం!:

ఈ భేటీలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన రెండు కరువు భత్యాల(డీఏ) ఆమోదంతో పాటు పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది.దసరా నుంచి రెండు డీఏలు అమలుచేయాలని నిర్ణయించింది.

## వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష..

హైదరాబాద్,వీబీ జీ రామ్ జీ అమలుపై బుధవారం మంత్రి సీతక్క సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు 12 వేలకు పైగా సర్పంచులు హాజరయ్యారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులను, సర్పంచ్ ల ద్వారా తెలుసుకున్నారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు.

క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలి..

సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి సీతక్క ఆరా తీశారు. VB--G RAM G అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట వేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో



ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి VB--G RAM G అమలును మరింత పటిష్టం చేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు.

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ,ఢిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం నేపథ్యంలో బాణసంచా వినియోగంపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, బుధవారం (సెప్టెంబర్ 30) కీలక వ్యాఖ్యలు చేసింది. బాణసంచాపై పూర్తి నిషేధం విధించ బోమని, అలాగని రోజంతా వాటిని కాల్చడానికి అనుమతి చబోమని కోర్టు స్పష్టం చేసింది. "మేము పూర్తి నిషేధానికి అంగీకరిం చము, అలాగే 24 గంటల పాటు వాటిని కాల్చడానికి అనుమతించ ము. పూర్తి నిషేధం కొంతమంది మనోభావా లను దెబ్బతీ స్తుంది; అదే సమయంలో రోజంతా బాణసంచా కాల్చడానికి అనుమతిస్తే వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు మరియు పిల్లలతో సహా ప్రతి జీవిపైనా తీవ్ర ప్రభావం పడుతుంది," అని కోర్టు పేర్కొంది. బాణసంచా కాల్చడానికి నిర్దిష్ట సమయాలను మరియు అనుమతించదగిన బాణసంచా రకాలను నిర్ణయించడం ద్వారా ఒక మధ్యేమా ర్గాన్ని కనుగొనాల్సిన అవసరం ఉందని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.

ఢిల్లీ ప్రభుత్వ శీతాకాల కాలుష్య నివారణ చర్యలు

ఢిల్లీ ప్రభుత్వ శీతాకాల కాలుష్య నివారణ చర్యలు వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి, కఠినమైన నిబంధనల అమలు, వాహనాలు మరియు నిర్మాణ కార్యకలాపాలపై ఆంక్షలు, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంపై దృష్టి సారిస్తూ ఢిల్లీ ప్రభుత్వం తన శీతాకాల కార్యాచరణ ప్రణాళిక 2026-27ను ఆవిష్కరించింది. ఢిల్లీ-ఎన్‌సిఆర్ వ్యాప్తంగా కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నాయని ముఖ్యమంత్రి రేఖా గుప్తా తెలిపారు. ఈ ప్రణాళిక 'సమగ్ర ప్రభుత్వ', 'సమగ్ర సమాజ' విధానాన్ని అవలంబిస్తుంది.

## 2 వేల మంది ఆదివాసీల ఆవేదన.. జోక్యం చేసుకోవాలని గవర్నర్‌కు తుడుం దెబ్బ వినతి



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా మావల మండలం బట్టిసవర్గాం పరిధిలోని కొమురం భీమ్ కాలనీలో దాదాపు 30 ఏళ్లుగా నివాసముంటున్న 2,000కు పైగా ఆదివాసీ కుటుంబాలకు ఇండ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేసి వారికి ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర తుడుం దెబ్బ అధ్యక్షుడు గోడం గణేష్ బుధవారం తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో పాటు గవర్నర్ ను కలిసి తుడుందెబ్బ సభ్యులు సర్వే నంబర్ 72/23 పరిధిలో గోండ్, ప్రధాన్, కోలాం, తోటి, ఆంధ్, నాయక్‌పోడ్ తదితర షెడ్యూల్డ్ తెగలకు చెందిన పేద కుటుంబాలు, ముఖ్యంగా పీవీటీజీ తెగలకు చెందిన కుటుంబాలు దశాబ్దాలుగా శాశ్వత నివాసాలు ఏర్పరచుకుని నివాసముంటున్నా ఇళ్ల పట్టాలు లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అర్హులైన 2,000 కుటుంబాలకు తక్షణమే ఇళ్ల పట్టాల హక్కులు కల్పించేలా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కబ్జాల నుంచి రక్షించండి:

కాలనీకి ఇంటి నంబర్లు కేటాయించి సీసీ/బిటి రోడ్లు, సురక్షితమైన తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ మరియు ఇతర కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు కాలనీలో విద్యుత్ కనెక్షన్లను క్రమబద్ధీకరించడంతో పాటు చిన్నారుల విద్య, వైద్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. పట్టణ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఈ సర్వే నంబర్ 72/23 భూమికి విలువ పెరగడంతో కొందరు భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు గిరిజనులను ఖాళీ చేయించేందుకు బెదిరింపులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు ఆదిలాబాద్ ఎస్పీకి ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించలేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం లేదు:

స్థానిక జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పోలీస్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన జరిపించి, బాధితులకు నిర్దేశిత వ్యవధిలో న్యాయం జరిగేలా చూడాలని గవర్నర్‌ను అభ్యర్థించారు. ఈ సమస్యను ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే శాసనసభ దృష్టికి తీసుకెళ్లారని, ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. మానవీయ కోణంలో స్పందించి రాజ్యాంగబద్ధమైన జోక్యంతో ఈ పేద గిరిజన కుటుంబాల దశాబ్దాల సమస్యను పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని తుడుం దెబ్బ నాయకులు గవర్నర్‌ను కోరారు.



## సంపాదకీయం

గురువారం 01-10-2026

# రహదారి భద్రతకు... రావాల్సిన మార్పులెన్నో

రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టంచేసింది. రహదారి నియమాల ఉల్లంఘనులకు విధించిన జరిమానాలు పూర్తిగా వసూలు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ, చెల్లించని వారిపై కఠిన చర్యలకు ఆదేశించింది. పదేపదే ఉల్లంఘనలకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని పేర్కొంది. ఈ క్రమంలో మన దేశంలో లోపభూయిష్టంగా మారిన డ్రైవింగ్ పరీక్షలు, లైసెన్సుల జారీపై నిశితంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. బ్రిటన్‌లో డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు ముందుగా హైవే కోడ్ అనే సమగ్ర నియమావళిని చదవాలి. తర్వాత థియరీ పరీక్షలో ట్రాఫిక్ నియమాలపై అవగాహనను పరీక్షిస్తారు. తదనంతరం 'హజార్డ్ పర్సెప్షన్ టెస్ట్' నిర్వహిస్తారు. రహదారిపై ప్రమాదం ఏర్పడే పరిస్థితిని ఎంత త్వరగా గుర్తించగలరనేది గమనిస్తారు. చివరగా అత్యంత కఠినమైన ప్రాక్టికల్ డ్రైవింగ్ టెస్ట్‌లో వాహన నియంత్రణ, పరిశీలనా శక్తి, ఓర్పు, మర్యాద, ఇతరుల పట్ల బాధ్యత వంటివన్నీ పరీక్షిస్తారు. ఆయా వ్యక్తులకు లైసెన్సు ఇస్తే సురక్షితమేనా అనేది నిర్ధారించుకుంటారు. బ్రిటన్‌లో డ్రైవింగ్ లైసెన్స్ హక్కు కాదు; సమర్థతకు ఇచ్చే గుర్తింపు. అక్కడ ప్రతి డ్రైవర్‌కూ హైవే కోడ్ ఒక మార్గదర్శి. డ్రైవింగ్ నేర్చుకునే ప్రతి ఒక్కరికీ రహదారి నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలి. ఉదాహరణకు మిర్రర్– సిగ్నల్–మెనోవర్: మలుపు తిరగడానికి, లేన్ మార్చడానికి, ఓవర్‌టేక్ చేయడానికి ముందు అద్దంలో గమనించాలి. తర్వాత సిగ్నల్ ఇవ్వాలి. చివరగా వాహనాన్ని కదిలించాలి. ఈ మూడు దశలు వేలాది ప్రమాదాలను నివారిస్తున్నాయి. 1997లో స్వీడన్ 'విజన్ జీరో' అనే విధానాన్ని ప్రకటించింది. బ్రిటన్ సహా అనేక దేశాలు ఇదే దిశగా అడుగులు వేశాయి. నిష్పాక్షికంగా చట్టాల అమలు, పాదచారుల పట్ల గౌరవం, ప్రతి ప్రాణం అమూల్యమనే సామాజిక స్పృహ– ఇవే వారి విజయ రహస్యాలు. ఇండియా కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తే ఎన్నో ప్రాణాలు కాపాడుకోవచ్చు. మన రహదారులను సురక్షితంగా మార్చాలంటే రోడ్డు భద్రతను జాతీయ ప్రాధాన్యాంశంగా ప్రకటించాలి. ప్రమాదాలు కేవలం రవాణా శాఖ సమస్య కాదు. ప్రజారోగ్యం, ఆర్థికాభివృద్ధి, విద్య, పోలీసు, పట్టణాభివృద్ధి, న్యాయవ్యవస్థ వంటి వాటన్నింటికీ సంబంధించిన జాతీయ అంశం. డివైడర్లు, కూడళ్లు, రౌండ్‌అబౌట్లు, రాత్రివేళ ప్రతిబింబించే సంకేతాలు, లేన్ మార్కింగ్స్, సూచికలు, హెచ్చరిక బోర్డులు, క్రాష్ బ్యారియర్లు, రంబుల్ స్ట్రిప్స్, గార్డ్ రైల్స్ వంటివన్నీ శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం ఉండాలి. కానీ, మన నగరాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమణల బారినపడటంతో పాదచారులు రోడ్డు మీదే నడుస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు దీనిపై గట్టి సూచనలనే చేసింది. ఈ మేరకు ఫుట్‌పాత్‌లు, జీబ్రా క్రాసింగ్‌లు, పాదచారుల సిగ్నల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సబ్‌వేలను సరైన ప్రణాళికతో ఏర్పాటు చేయాలి.

ప్రాణాంతక బాధ్యతా రాహిత్యం

రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, ఏటా రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారిలో దాదాపు 40శాతం మంది ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్నవారే. హెల్మెట్ ధరించకపోవడం మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటి. వెనక కూర్చునే వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సి ఉన్నా, పట్టించుకోవడం లేదు. ద్విచక్ర వాహనాలపై చిన్నారులను ఎలాంటి రక్షణ లేకుండా అదనంగా తీసుకెళ్లడం నియమాల ఉల్లంఘనే కాదు వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే బాధ్యతారాహిత్యం. హెల్మెట్‌ను భారంగా కాకుండా ప్రాణరక్షక కవచంగా భావించే సంస్కృతి బలపడాలి. హెల్మెట్ అవసరాన్ని ప్రభుత్వం, అధ్యాపకులు, మీడియా, ఎన్జీవోలు కలిసి ప్రజల్లోకి తీసుకెళ్లాలి. డ్రైవింగ్ విషయంలో ముందుగా శిక్షకులకు శిక్షణ ఇవ్వాలి. లంచాలతో లైసెన్సులు ఇచ్చే వ్యవస్థ పోవాలి. పదోతరగతి దాకా రోడ్డు భద్రతను తప్పనిసరి పాఠ్యాంశంగా బోధించాలి. విద్యార్థులకు రోడ్డు దాటేటప్పుడు పాటించాల్సిన నియమాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, సైకిల్ భద్రత, హెల్మెట్ ప్రాధాన్యం, సీట్ బెల్ట్ వినియోగం, అత్యవసర సహాయం వంటి అంశాలు నేర్పాలి. సాంకేతికతను సమర్థంగా వినియోగించి ఏఐ ఆధారిత, వేగ నియంత్రణ నిఘా కెమెరాలు, రెడ్ సిగ్నల్ ఉల్లంఘనలను గుర్తించే కెమెరాలు, వాహన నంబర్ ప్లేట్లను స్వయంచాలకంగా గుర్తించే వ్యవస్థలను ఏర్పరచాలి. తద్వారా ఉల్లంఘనులను మానవ జోక్యం లేకుండానే గుర్తించి, జరిమానాలు విధించే పారదర్శక వ్యవస్థను అభివృద్ధి చేయవచ్చు. డ్రంకెన్ డ్రైవింగ్‌పై రాజీ లేని విధానం అమలు చేయాలి. సామాన్యులకూ, ప్రముఖులకూ సమానంగా నిబంధనలు వర్తింపజేయాలి. ప్రతి వాహనంలో ఎయిర్ బ్యాగ్‌లు, చక్రాలు లాక్ కాకుండా నిరోధించే ఏబీఎస్ బ్రేకింగ్, వాహనం అదుపు తప్పకుండా కాపాడే ఎలక్ట్రానిక్ స్థిరత్వ నియంత్రణ వ్యవస్థలు ఉండాలి. ప్రమాదాల్లో దెబ్బతినని వాహన నిర్మాణం, సీట్‌బెల్ట్ పెట్టుకోవాలంటూ హెచ్చరించే వ్యవస్థ, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు తదితర ఆధునిక భద్రతా సదుపాయాలను తప్పనిసరి చేయాలి.

దర్యాప్తు బోర్డులు ఉండాలి

రోడ్డు భద్రతపై ప్రధానమంత్రి స్థాయిలో జాతీయ రోడ్డు భద్రత మిషన్ ఏర్పాటు చేసి, ప్రతి రాష్ట్రం వార్షిక లక్ష్యాలతో పనిచేయాలి. 'గోల్డెన్ అవర్'గా భావించే ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటలో బాధితులకు సరైన వైద్య సాయం అందిస్తే, వారి ప్రాణాలు కాపాడవచ్చు. అందుకోసం నిరంతర అంబులెన్స్ సేవలు, జీపీఎస్ ఆధారిత అత్యవసర స్పందన వ్యవస్థ, అత్యాధునిక ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయడం రోడ్డు భద్రతలో అంతర్భాగంగా పరిగణించాలి. రోడ్డు ప్రమాదాల్ని శాస్త్రీయంగా విశ్లేషించే ప్రమాద దర్యాప్తు బోర్డులు ఏర్పాటు కావాలి. ఆధునిక భౌగోళిక సమాచార వ్యవస్థ సాయంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన మార్పులు చేపట్టాలి. అలాగే, ప్రమాదాల్లో గాయపడిన వారి వివరాలు, గాయాల స్వరూపం, చికిత్స ఫలితాలు వంటి సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేసే నేషనల్ ఇంజ్యూరీ రిజిస్ట్రీని ఏర్పాటు చేయాలి. ప్రతి ప్రమాదాన్ని ఒక గణాంకంగా కాకుండా, భవిష్యత్తులో మరొక ప్రాణాన్ని కాపాడే గుణపాఠంగా చూడగలిగినప్పుడే దేశంలో రోడ్డు భద్రత నిజమైన పురోగతి సాధిస్తుంది.

# మైనర్ల డిజిటల్ భద్రతకు చట్టరక్షణ



హైదరాబాద్,మన దైనందిన జీవితంలో సామాజిక మాధ్యమాలు విడదీయలేని భాగంగా మారాయి. సమాచారాన్ని తెలుసుకోవడం, భావాలను వ్యక్తం చేయడం, ప్రపంచంతో అనుసంధానమవడం వంటి ఎన్నో ప్రయోజనాలు వీటి ద్వారా చేకూరుతున్నాయి. అయితే ఇదే వేదికలు బాలబాలికల పాలిట ప్రమాదకరంగా మారుతున్న సందర్భాలూ పెరుగుతున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటున్న డిజిటల్ ప్రపంచంలో పిల్లల భద్రత ప్రశ్నార్థకమవుతోంది. సైబర్ వేధింపులు, అసభ్యకరమైన కంటెంట్, ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, డిజిటల్ వ్యసనం వంటి సమస్యలు వారి శారీరక, మానసిక వికాసంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో 18 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరవడానికి తల్లిదండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసే అంశాన్ని పరిశీలించాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మైనర్లు సామాజిక మాధ్యమాలను ఉపయోగించడం సమస్య కాదు. వారి వయసుకు తగిన అవగాహన, విచక్షణ, పరిణతితో సంబంధం లేకుండా ఎలాంటి నియంత్రణలూ లేని వాతావరణంలోకి ప్రవేశించడమే అసలు సమస్య. పిల్లలను ఆకట్టుకునేలా రూపొందించిన అల్గారిథమ్‌లు వారిని గంటల తరబడి తెరలకు అతుక్కుపోయేలా చేస్తున్నాయి.ఒక వీడియో చూసిన వెంటనే మరో వీడియోను, ఒక పోస్టు తర్వాత మరో పోస్టును చూపించే విధానం వారి సమయాన్ని హరిస్తోంది. చదువుపై ఏకాగ్రత తగ్గడం, నిద్రకు ఆటంకం కలగడం, శారీరక శ్రమ తగ్గడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతటితో సమస్యలు సమసిపోవడం లేదు. నకిలీ ఖాతాల ద్వారా పరిచయాలు పెంచుకొని పిల్లలను వలలో వేసుకోవడం, వ్యక్తిగత ఫొటోలు, వివరాలను సేకరించడం, వాటితో బెదిరింపులకు పాల్పడటం వంటి సైబర్ నేరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పిల్లలకు తెలియకుండానే వారి వ్యక్తిగత సమాచారం వాణిజ్య ప్రయోజనాలకు వినియోగమవుతోంది. అనుచితమైన దృశ్యాలు, హింసాత్మక కంటెంట్, తప్పుడు సమాచారం సైతం వారి దృష్టికి వస్తున్నాయి. ఒకసారి డిజిటల్ వేదికపైకి చేరిన వ్యక్తిగత సమాచారం పూర్తిగా తొలగిపోతుందన్న నమ్మకం లేదు. దాని దుర్వినియోగంవల్ల కలిగే నష్టాన్ని అర్థం చేసుకునే పరిణతి పిల్లలకు అన్ని సందర్భాల్లోనూ ఉండదు. భారతీయ ఒప్పందాల చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు వ్యక్తులు స్వతంత్రంగా చట్టబద్ధమైన ఒప్పందాలు కుదుర్చుకోలేరు. కానీ ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి వేదికల్లో ఖాతా తెరిచే సమయంలో వినియోగ నిబంధనలకు అంగీకరించాల్సి ఉంటుంది. వయసును పుట్టిన తేదీ ఆధారంగా నిర్ధారిస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఆ వివరాల నిజానిజాలను ధ్రువీకరించే వ్యవస్థలు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయన్నది ప్రశ్నార్థకమే. ఒప్పందం కుదుర్చుకునే చట్టపరమైన అర్హత లేని మైనర్లు డిజిటల్ వేదికల నిబంధనలకు అంగీకరిస్తున్నట్లు పరిగణించడం, ఆ ఒప్పందాల అమలుకు సంబంధించిన బాధ్యతలను నిర్ధారించడం వంటి అంశాలపై స్పష్టత అవసరం.ఈ వైరుధ్యాన్ని తొలగించకుండా పిల్లల డిజిటల్ భద్రతకు సంపూర్ణ రక్షణ కల్పించడం సాధ్యం కాదు. ఇప్పటికే డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం– 2023, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం–2000, ఐటి నిబంధనలు –2021 వంటి చట్టపరమైన వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని ప్రాసెస్ చేయడానికి తల్లిదండ్రుల ధ్రువీకరించిన సమ్మతి పొందాల్సిన నిబంధనలూ ఉన్నాయి. అయినప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో మైనర్లు ఖాతాలు తెరవడం, వయసును ధ్రువీకరించడం, తల్లిదండ్రుల సమ్మతిని నిర్ధారించడం, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో మరింత నిర్దిష్టమైన, సమర్థమైన అమలు వ్యవస్థ అవసరం. ఈ నేపథ్యంలో ఐటి నిబంధనలు– 2021లో తగిన సవరణలు తీసుకురావడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. ఖాతా ప్రారంభానికి ముందు వయసు నిర్ధారణ, తల్లిదండ్రులు లేదా సంరక్షకుల సమ్మతి ధ్రువీకరణ, పిల్లల వ్యక్తిగత సమాచారానికి రక్షణ, అనుచితమైన కంటెంట్ నియంత్రణ వంటి అంశాలకు చట్టబద్ధమైన ప్రాతిపదిక కల్పించాలి. అదే సమయంలో పిల్లల వ్యక్తిగత వివరాలను సేకరించే ప్రక్రియే వారి గోప్యతకు ముప్పుగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే, తల్లిదండ్రుల సమ్మతిని తప్పనిసరి చేయడమే సమస్యలన్నింటికీ పరిష్కారం కాదు. వయసు నిర్ధారణలో లోపాలు, తప్పుడు వివరాలతో ఖాతాలు తెరవడం, తల్లిదండ్రులకు తెలియకుండా ఇతరుల ఖాతాలను ఉపయోగించడం వంటి అవకాశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. విద్య, సృజనాత్మకత, సమాచార సేకరణకు ఉపయోగపడే డిజిటల్ వనరులను పిల్లలకు పూర్తిగా దూరం చేయకుండా, వారి వయసుకు తగిన రీతిలో అందుబాటులో ఉంచే విధానాలనూ రూపొందించాలి. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న తరుణంలో చట్టాలు వెనుకబడిపోకూడదు. అలాగే, సుప్రీం కోర్టు లేవనెత్తిన అంశాన్ని ప్రభుత్వాలు మరో న్యాయపరమైన చర్చగా మాత్రమే చూడకుండా, బాలల హక్కుల పరిరక్షణకు అవసరమైన సంస్కరణలకు అవకాశంగా మలచుకోవాలి.

# యోగి హ్యాట్రిక్ సీఎం అవుతారా?



లక్నో:దేశంలోనే అత్యధిక ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలున్న డిసైడర్ ఫ్యాక్టర్ లాంటి ఉత్తరప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడూ దేశవ్యాప్తంగా తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తాయి.. కానీ రాబోయే 2027 అసెంబ్లీ ఎన్నికలు మాత్రం మునుపెన్నడూ లేనంత ఉత్కంఠభరితంగా మారనున్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ వరుసగా మూడోసారి అధికారాన్ని దక్కించుకొని చారిత్రాత్మక హ్యాట్రిక్ సాధించాలని మహత్తర లక్ష్యంతో ముందుకుసాగుతోంది. 2017లో ఊహించని భారీ మెజారిటీతో పీఠమెక్కిన యోగి.. 2022లోనూ తన సమర్థ నాయకత్వంతో కాషాయ జెండాను ఎగురవేశారు. అయితే 2027 సమరం మాత్రం కేవలం ఎన్నికల పోరు మాత్రమే కాదు.. యోగి ఆదిత్యనాథ్ వ్యక్తిగత ప్రజాదరణకు.. యూపీలో బీజేపీ సంస్థాగత బలానికి తీవ్రమైన అగ్నిపరీక్షగా మారనుంది.గత అనుభవాలు అనుకూలంగా ఉన్నప్పటికీ ఇటీవల ముగిసిన 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీకి ఊహించని రాజకీయ షాక్‌ను ఇచ్చాయి. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ.. కాంగ్రెస్‌తో కలసి సాధించిన బలమైన ప్రదర్శన అధికార పక్షాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఈ లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ సరళి రాబోయే అసెంబ్లీ పోరులోనూ పునరావృతమవుతుందా లేక 2027 నాటికి బీజేపీ తన పట్టును తిరిగి సాధించుకుంటుందా అనేది ఇప్పుడు ప్రధానాంశంగా మారింది. యోగికి 'బుల్డోజర్ బాబా'గా ఉన్న కఠినమైన పాలకుడి ఇమేజ్, నేరాల నియంత్రణ, మహిళల భద్రత, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు బీజేపీకి ప్రధాన ప్రచార ఆయుధాలుగా మారనున్నాయి. కానీ కేవలం ఈ ఇమేజ్ మాత్రమే ప్రతికూలతలను దాటుకుని గెలుపుతీరాలకు చేరుస్తుందా అనేది వేచి చూడాలి.ఉత్తరప్రదేశ్ రాజకీయాలను ఎల్లప్పుడూ శాసించేది సంక్లిష్టమైన కుల సమీకరణాలే. యోగి ప్రభుత్వం తన వైపు ఉన్న అగ్రవర్ణాలు, ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) బలమైన సామాజిక కూటమిని కాపాడుకోవాలని చూస్తుంటే అఖిలేష్ యాదవ్ తన 'పీడీఏ' (పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్) వ్యూహంతో దళితులు ,ఇతర బీసీ ఓటర్లను ఆకర్షించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు మాయావతి నేతృత్వంలోని బిఎస్పీ ఓట్లను ఎంతవరకు సాధిస్తుందనేది కూడా అత్యంత కీలకం కానుంది. బిఎస్పీ బలహీనపడితే ఆ దళిత ఓటు బ్యాంక్ ఎటువైపు మళ్లుతుందనే దానిపైనే ఎస్పీ, బీజేపీల గెలుపోటములు ఆధారపడి ఉంటాయి. దీనికి తోడు ఎస్పీ–కాంగ్రెస్ కూటమి మధ్య సజావుగా సాగే సీట్ల పంపిణీ, బూత్ స్థాయి సమన్వయం బీజేపీకి గట్టి సవాలు విసరగలవు.యోగి ప్రభుత్వంపై సానుకూల అభిప్రాయం ఉన్నప్పటికీ.. స్థానిక ఎమ్మెల్యేల పనితీరు మాత్రం వేరే అంశం. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత, స్థానిక సమస్యలు, అభ్యర్థుల ఎంపికలో తప్పిదాలు బీజేపీకి నష్టం కలిగించే అవకాశం ఉంది. అందుకే యోగి ఇమేజ్‌తో పాటు నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల ఎంపిక కీలకం కానుంది. ఇక బీజేపీ ఆర్ఎస్ఎస్ సమన్వయం, బూత్ స్థాయి సంస్థాగత బలం, ఓటర్లను పోలింగ్ కేంద్రాల వరకు తీసుకురావడం వంటి అంశాలు కూడా హ్యాట్రిక్ ప్రయత్నంలో కీలక పాత్ర పోషించనున్నాయి.కేవలం కుల సమీకరణాలు, విపక్షాల కూటమి మాత్రమే కాకుండా స్థానిక ప్రజా సమస్యలు కూడా ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాయి. నిరుద్యోగం, ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై యువత స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తికరం. అదే సమయంలో సంక్షేమ పథకాలు, ప్రత్యక్ష నగదు బదిలీ, సురక్షితమైన వాతావరణం పొందుతున్న మహిళా ఓటర్లు యోగి ప్రభుత్వానికి పెద్ద దిక్కుగా మారే అవకాశముంది. వీటితో పాటు నియోజకవర్గాల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను అధిగమించడం.. వ్యూహాత్మకంగా అభ్యర్థులను ఎంపిక చేయడం బీజేపీ ముందున్న అతిపెద్ద సవాలు. లోక్‌సభ ఎన్నికల హెచ్చరికను అర్థం చేసుకుని.. ఆర్ఎస్ఎస్ మద్దతుతో బూత్ స్థాయి యంత్రాంగాన్ని పటిష్టం చేసుకుంటేనే యోగి ఆదిత్యనాథ్ మూడోసారి లక్నో పీఠాన్ని అధిరోహించి కొత్త చరిత్ర సృష్టించగలరు.2022తో పోలిస్తే బీజేపీకి 2024 ఫలితాల రూపంలో కొత్త సవాలు ఎదురైంది. అదే సమయంలో యోగి వ్యక్తిగత ఇమేజ్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సంస్థాగత బలం బీజేపీకి అనుకూల అంశాలుగా ఉన్నాయి. అందుకే 2027లో యోగి హ్యాట్రిక్‌ను నిర్ణయించేది ఒక్క 'బుల్డోజర్ ఇమేజ్' కాదు. యోగి ప్రజాదరణతో పాటు కుల సమీకరణాలు, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, యువత--మహిళల ఓటు, ప్రతిపక్ష ఐక్యత, 2024 తర్వాత మారిన రాజకీయ సమీకరణాలు.. ఈ ఐదు అంశాలే అసలు కీలకంగా మారనున్నాయి. ప్రతిపక్షాలు ఈ అంశాలను సమర్థంగా కలుపుకోగలిగితే పోటీ మరింత హోరాహోరీగా మారవచ్చు. బీజేపీ తన సంస్థాగత బలంతో పాటు 2024లో వచ్చిన సందేశాన్ని ఎంతవరకు అర్థం చేసుకుని వ్యూహాన్ని మార్చుకుంటుందన్నదే యోగి హ్యాట్రిక్‌కు అసలు పరీక్ష.

# అమరావతి ఔటర్ రింగ్ రోడ్ కు లైన్ క్లియర్

విజయవాడ,ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 189.93 కిలోమీటర్ల పొడవునా 6 లేన్లతో నిర్మించనున్న ఈ ఔటర్ రింగ్ రోడ్డు పనులను 4 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసి ఎన్‌హెచ్ఏఐ కి ప్రతిపాదనలు పంపించారు. ఈ రహదారితో పాటు నారాకోడూరు నుంచి గుంటూరు శివార్లలోని బుడంపాడు వరకు 5.2 కిలోమీటర్ల పొడవునా 4 వరుసల స్పర్ రోడ్డును కూడా అనుసంధానం చేయనున్నారు. దీంతో ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు 195.13 కిలోమీటర్లకు చేరుకుంది. అమరావతి ఓఆర్ఆర్‌లో కృష్ణా నదిపై 2 వంతెనలు, 3 సొరంగాలు సహా అన్ని పనులు కలిపి 4 ప్యాకేజీలుగా విభజించారు. గతంలో ప్రతి 25 నుంచి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 6 నుంచి 8 ప్యాకేజీలుగా నిర్మించాలని మొదట భావించినప్పటికీ, పనుల పర్యవేక్షణ సులభతరం చేసేందుకు ప్యాకేజీల సంఖ్యను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు.మొదటి ప్యాకేజీ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి ప్రారంభమై కొండపల్లి, పంగిడి అటవీ ప్రాంతాల మీదుగా మైలవరం వరకు (27వ కిలోమీటర్) సాగుతుంది. ఇందులో 2 సొరంగాలు ఉంటాయి. అలాగే చివర్లో ఉండే 189వ కిలోమీటర్ నుంచి 189.93 కిలోమీటర్ వరకు ఉన్న పనులను ఈ మొదటి ప్యాకేజీలోనే చేర్చారు. రెండో ప్యాకేజీ మైలవరం 27వ కిలోమీటర్ నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను సమీపంలోని 83వ కిలోమీటర్ వరకు మొత్తం 56 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది.మూడో ప్యాకేజీ కోలవెన్ను 83వ కిలోమీటర్ నుంచి ప్రారంభమై గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని 133.5వ కిలోమీటర్ వరకు 50.5 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ ప్యాకేజీలో అదనంగా నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు ఉండే 5.2 కిలోమీటర్ల కనెక్టింగ్ రోడ్డుతో పాటు, వల్లూరుపాలెం వద్ద కృష్ణానదిపై 4.8 కిలోమీటర్ల పొడవైన వంతెన నిర్మించనున్నారు. నాలుగో ప్యాకేజీ పుల్లడిగుంట (133.5 కి.మీ) దగ్గర మొదలై ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల సమీపంలోని 189వ కిలోమీటర్ వరకు 55.5 కిలోమీటర్ల మేర ఉంటుంది.

# కొలిక్కి వచ్చిన వివేకా కేసు

హైదరాబాద్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో రోజుకో కొత్త మలుపు చోటుచేసుకుంటోంది. ఈ కేసులో ఏ2గా ఉన్న కీలక నిందితుడు సునీల్ యాదవ్ సంచలన కామెంట్లతో విచారణాధికారులతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు, వెనుక ఉన్న కుట్ర కోణాలను తాను ఈడీ అధికారులతో పాటు బయటి ప్రపంచానికి కూడా వెల్లడిస్తున్నారు. ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణాలు, లాభపడిన వ్యక్తుల పేర్లను నేరుగా ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఈ కేసు తీవ్రతను మరో స్థాయికి తీసుకెళ్లాయి.వివేకా హత్య ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభపడింది మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన భార్య వైఎస్ భారతి, అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాత్రమేనని సునీల్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. అసలు సూత్రధారులను పక్కనపెట్టి తమ వంటి వారిని వేధించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, విచారణ పారదర్శకంగా జరగాలంటే జగన్ , భారతిలను కూడా సీబీఐ, ఈడీ అధికారులు తక్షణమే విచారించాలని ఆయన బహిరంగంగా డిమాండ్ చేశారు. ఇప్పటికే అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం కంటే, కుట్రలో చురుగ్గా పాల్గొన్న సునీల్ యాదవ్ ఇలా తెగించి మాట్లాడటం కేసు గమనాన్ని మార్చేలా ఉంది.సునీల్ యాదవ్ చేసిన ఈ ఆరోపణలు దర్యాప్తు సంస్థల పనితీరుపై కూడా పలు అనుమానాలను, ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. హత్య జరిగిన సమయం నుంచి నేటి వరకు లభ్యమైన ఆధారాలు, సాక్ష్యాలు ఒక వైపు వేళ్లు చూపిస్తున్నప్పటికీ.. దర్యాప్తు సంస్థలకు ఈ ప్రాథమిక అనుమానాలు ఎందుకు రావడం లేదనే చర్చ నడుస్తోంది. కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక వ్యక్తుల సమీపానికి కూడా సీబీఐ అధికారులు వెళ్లేందుకు ఎందుకు సంకోచిస్తున్నారనే ప్రశ్నలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.దస్తగిరి, సునీల్ యాదవ్ కేవలం హత్యలో భాగం అయిన వారు. డబ్బుల కోసం ఆ పని చేసిన వారు. కానీ అసలు సూత్రధారులు , హత్యకు కారణమైన పెద్ద తలకాయలను విచారించకుండా, కేవలం క్షేత్రస్థాయిలో ఉన్న వారిపైనే దృష్టి సారిస్తే ఈ కేసు చిక్కుముడి ఎలా వీడుతుందనేది యక్షప్రశ్నగా మారింది. గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ హైప్రొఫైల్ హత్య కేసులో దస్తగిరి తరహాలోనే మరొక కీలక నిందితుడు బయటపడి నేరుగా మాజీ సీఎం కుటుంబాన్నే నిలదీయడం రాజకీయంగా పెద్ద దుమారమే రేపుతోంది. సునీల్ యాదవ్ లేవనెత్తిన ఈ డిమాండ్లపై సీబీఐ, ఈడీ అధికారులు ఏ రకంగా స్పందిస్తారో, విచారణ ప్రక్రియను ఏ మలుపు తిప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

# డైరక్ట్ ఎన్నికలతో ఇబ్బందులేనా

నెల్లూరు, కూటమి ప్రభుత్వం మున్సిపల్ చట్టాలకు సవరణలు చేస్తూ మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్‌లను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించడం వైసీపీ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తోంది. పరోక్ష ఎన్నికల విధానంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలిపించుకుని, అనంతరం రాజకీయ సమీకరణాలతో , క్యాంప్ రాజకీయాలతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి , కనీసం గట్టి పోటీ ఇవ్వడానికి అవకాశముండేది. వార్డుల వారీగా పరిమిత శక్తిని ఉపయోగించి కొన్ని స్థానాలు గెలిచినా పార్టీ ఉనికి ఉందనే '' సంకేతాలు ఇచ్చే అవకాశం దక్కేది. అయితే, నగర లేదా పట్టణ స్థాయి మొత్తాన్ని ఒకే నియోజకవర్గంగా భావించి జరిగే ఈ ప్రత్యక్ష పోరులో విజయం సాధించాలంటే విస్తృతమైన ప్రజాదరణతో పాటు సమగ్రమైన యంత్రాంగం అవసరం. ఇది ప్రతిపక్షంలో ఉన్న వైసీపీకి అతిపెద్ద సమస్యగా మారింది.మేయర్ , ఛైర్మన్ స్థాయి ప్రత్యక్ష ఎన్నికలంటే నగరమంతటా ప్రచారం నిర్వహించడం, భారీ ఎత్తున ఆర్థిక, అంగబలాలను సమకూర్చుకోక తప్పదు. ప్రస్తుతం రాష్ట్

# కన్నయ్య,జాఖడ్‌లకు రాహుల్ ప్రశ్నలు

ఢిల్లీ : ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (డీయూఎస్‌యూ) ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ ఎదుర్కొన్న పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరా తీశారు. ఎన్నికల్లో గెలుపు అంచనాలతో బరిలోకి దిగిన ఎన్ఎస్‌యూఐ ఒక్క కేంద్ర పదవినీ దక్కించుకోకపోవడంతో పార్టీ నాయకత్వం దీనిపై సమీక్ష చేపట్టింది. ఈ క్రమంలో ఎన్ఎస్‌యూఐ ఇన్‌ఛార్జ్ కన్నయ్య కుమార్, జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖడ్‌లతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. సమావేశంలో కన్నయ్య కుమార్, వినోద్ జాఖడ్‌లను రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు అడిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా అధ్యక్ష పదవికి ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి చివరి వరకు గట్టి పోటీ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. 'అధ్యక్ష పదవిని గెలిచేందుకు చాలా దగ్గరగా వచ్చాం. తర్వాత ఏం జరిగింది?' అని ఆయన ప్రశ్నించినట్లు వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహం వంటి అంశాలపై కూడా రాహుల్ గాంధీ వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు సమయంలో కన్నయ్య కుమార్ బాధ్యత తీసుకున్నారని కేసీ వేణుగోపాల్ ప్రస్తావించినట్లు సమాచారం. ఎన్నికల ముందు ఉన్న అంచనాలకు భిన్నంగా ఫలితాలు ఎందుకు వచ్చాయనే దానిపై ఆయన వివరణ కోరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.డీయూఎస్‌యూ కేంద్ర ప్యానెల్‌లో నాలుగు పదవులు ఉన్నాయి. అధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను ఏబీవీపీ గెలుచుకుంది. ఉపాధ్యక్ష పదవిని స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ గెలుచుకున్నారు. ఎన్ఎస్‌యూఐ ఒక్క పదవినీ దక్కించుకోలేకపోయింది. మాజీ ఎన్ఎస్‌యూఐ సభ్యుడు దీపాంశు షోకీన్ స్వతంత్రంగా పోటీ చేసి ఉపాధ్యక్ష పదవిని గెలవడం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. 2023, 2024 డీయూఎస్‌యూ ఎన్నికల్లో షోకీన్ ఎన్ఎస్‌యూఐ తరఫున ప్రచారం చేశారు. ఈసారి టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆయన 30,615 ఓట్లు సాధించి ఏబీవీపీ అభ్యర్థిపై 13,705 ఓట్ల భారీ తేడాతో గెలిచారు. ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి 4,313 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. షోకీన్‌ను పార్టీలో ఎందుకు కొనసాగించలేకపోయారని రాహుల్ గాంధీ ప్రశ్నించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన పెట్టిన కొన్ని షరతులు ఆమోదయోగ్యంగా లేవని కన్నయ్య కుమార్, జాఖడ్ వివరించినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారాన్ని నిర్వహించిన తీరుపై రాహుల్ సంతృప్తి చెందలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. యువతతో మరింతగా మమేకం కావడానికి కాంగ్రెస్ ఇటీవల పలు కార్యక్రమాలు చేపడుతోంది. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో 'ఛాత్రోన్ కీ గూంజ్' పేరుతో విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ నగరాల్లో యువతతో సంబంధాలు పెంచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డీయూఎస్‌యూ ఫలితం పార్టీ యువజన విభాగం బలంపై చర్చకు దారితీసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా జెన్-జీ యువత రాజకీయ అంశాలపై చూపుతున్న ఆసక్తి, విద్యార్థి ఉద్యమాలపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.డీయూఎస్‌యూ అధ్యక్ష పదవిలో ఏబీవీపీకి చెందిన యశ్ దబాస్ 24,576 ఓట్లు సాధించగా, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనా 22,523 ఓట్లు పొందారు. దీంతో 2,053 ఓట్ల తేడాతో దబాస్ విజయం సాధించారు. ఈ ఫలితాల నేపథ్యంలో ఎన్ఎస్‌యూఐ ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, సంస్థాగత బలం వంటి అంశాలను కాంగ్రెస్ నాయకత్వం సమీక్షిస్తున్నట్లు సమాచారం.

# మంత్రివర్గంలో నో సీనియర్స్

విజయవాడ, మరికొద్ది రోజుల్లో ఏపీ మంత్రి వర్గ విస్తరణ ఉండనుందన్న ప్రచారం ఊపందుకుంది. రెండున్నరేళ్లు ముగిసిన తర్వాత కేబినెట్ మార్పులపై టీడీపీలో ఇప్పటి నుంచి చర్చ జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గాన్ని ఇలా ఎంపిక చేయడం వెనక కూడా దూరాలోచన ఉందని అంటున్నారు. రానున్న మంత్రి వర్గ విస్తరణలో కూడా సీనియర్లకు అవకాశం ఉండదన్న వాదన వినిపిస్తుంది. మరోసారి జూనియర్లకే అవకాశం ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు కారణాలు కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి వర్గ కూర్పులో సాంప్రదాయ రాజకీయ సమీకరణాలకు భిన్నంగా, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత వ్యూహాత్మక ఆలోచనలతో మంత్రులను ఎంపిక చేశారు. సీనియర్లను పక్కనపెట్టి మరీ ఎక్కువ మంది కొత్తవారికి చోటు కల్పించడం వెనుక ఆయనకున్న ప్రధాన ఆలోచనలు, వ్యూహాలు అనేకం ఉండొచ్చు. కొత్త నాయకత్వాన్ని తయారు చేయడం ఇందుకు ఉదాహరణ. మంత్రివర్గంలో మొత్తం 24 మంది మంత్రులలో 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన పదిమందికి పైగా నేరుగా మంత్రి పదవులు దక్కాయి. రాబోయే కొన్ని దశాబ్దాల పాటు టు పార్టీని, రాష్ట్రాన్ని నడిపించగల సమర్థులైన ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ఇప్పుడే తయారు చేయాలనేది చంద్రబాబు సుదీర్ఘ వ్యూహమని చెబుతున్నారు.. బీసీలకు పెద్దపీటమంత్రివర్గంలో వెనుకబడిన తరగతులకు 8 పదవులు, కాపులు మరియు కమ్మ సామాజిక వర్గాలకు చేరో 4 పదవులు, ఎస్సీలకు 3, ఎస్టీ మరియు మైనారిటీలకు ఒక్కో పదవి చొప్పున కేటాయించారు.ఆలోచన: టిడిపికి సాంప్రదాయకంగా అండగా ఉండే బీసీలకు ఈసారి కూడా పెద్దపీట వేయడం ద్వారా సామాజిక సమతూకాన్ని పాటించారు. అంతేకాకుండా మహిళలకు, గిరిజన ప్రాంతాలకూ ప్రాతినిధ్యం కల్పించారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బుచ్చయ్య చౌదరి, కన్నా లక్ష్మీనారాయణ వంటి హేమాహేమీ సీనియర్లను మంత్రివర్గంలోకి తీసుకోలేదు.ఆలోచన: సీనియర్లను కేవలం పరిపాలనకే పరిమితం చేయకుండా, వారి అనుభవాన్ని పార్టీ సంస్థాగత బలోపేతానికి మరియు శాసనసభ వ్యవహారాల నిర్వహణకు వాడుకోవాలనేది చంద్రబాబు ఆలోచన. పర్ఫార్మెన్స్ ఆధారిత పాలనమంత్రివర్గాన్ని ఎంపిక చేసిన తర్వాత కూడా చంద్రబాబు మంత్రుల పనితీరుపై నిరంతరం సమీక్షలు జరుపుతున్నారు. మంత్రులకు అంతర్గతంగా ర్యాంకులు ఇవ్వడం ద్వారా వారిలో పోటీతత్వాన్ని పెంచుతున్నారు. గత ప్రభుత్వం వల్ల దెబ్బతిన్న వ్యవస్థలను బాగు చేయాలన్నా, కేంద్ర నిధులను రాబట్టాలన్నా మంత్రులు నిరంతరం క్రియాశీలకంగా ఉండాలనేది ఆయన ఆలోచనఅని చెబుతున్నారు. కేవలం పదవుల అనుభవం కోసం కాకుండా డెలివరీ ఆధారంగానే మంత్రుల భవిష్యత్తు ఉంటుందని బాబు స్పష్టం చేశారు. మొత్తంగా చూస్తే, చంద్రబాబు నాయుడు ఈసారి కేవలం రాజకీయ లెక్కల కోసమే కాకుండా, వేగవంతమైన అభివృద్ధి, సమర్థవంతమైన పాలన , మరియు పార్టీ భవిష్యత్తు పునాది అనే త్రివిధ వ్యూహంతోనే ఈ మంత్రుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారని, రేపు మంత్రి వర్గ విస్తరణ జరిగినా ఇలాగే ఉంటుందని అంటున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై ఆగ్రహం

జనగామ,జనగామ మండలం ఎల్లంల గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల ఎంపికలో తన పేరు రాలేదని మనస్తాపానికి గురైన బిర్రు రాజు గ్రామపంచాయతీ ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే అడ్డుకున్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లేదని ఆరోపిస్తూ.. అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని రాజు డిమాండ్ చేశాడు.

# కొత్త పార్టీలతో ఓట్ల చిక్కులు.. తెలంగాణలో మారనున్న సీన్!




హైదరాబాద్,రాజకీయాల్లో కొత్త పార్టీలు పుట్టుకురావడం సహజమే. అయితే... వాటి వల్ల ప్రధాన రాజకీయ పార్టీలకు ఏమేరకు ఓటు బ్యాంకుకు గండి పడుతుందన్నది కూడా అంతే ముఖ్యం. ఏపీలో ఈ తరహా పరిస్థితి లేదు. సామాజిక వర్గాల వారీగా .. ప్రజలు పార్టీలను ఆదరిస్తున్నారు. కానీ, తెలంగాణలో సెంటిమెంటు రాజకీయాలు పెరుగుతున్నాయి. దీంతో కొత్త పార్టీలు పుట్టుకువస్తున్న ప్రతిసారీ ప్రధాన రాజకీయ పార్టీలు ఇరకాటంలో పడుతున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి ఈ పార్టీల హవా మరింత పెరగనుంది.కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ.. సంస్థాగతంగా 32-38 శాతం మధ్యే ఓటు బ్యాంకు ఉంది. సుమారు 40% పైచిలుకు ఓటు శాతం పుంజుకుంటే తప్ప.. పటిష్టమైన అధికారం నిలుపుకొనే అవకాశం లేదన్న లెక్కలు వున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సంస్థాగత ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. అయితే సంక్షేమ హామీలు, ఉద్యోగాలపై అంచనాలు అందుకోకపోతే వ్యతిరేకత వచ్చే అవకాశం లేకపోలేదన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. వీటినే కొత్తగా ఏర్పడుతున్న పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి.ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓటు బ్యాంకు క్రమంగా తగ్గుముఖం పట్టింది. పార్లమెంట్, స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ ఓట్ల శాతం పడిపోయింది. అయితే.. క్షేత్రస్థాయిలో బలమైన కేడర్, నిర్దిష్ట రాజకీయ గుర్తింపు ఉన్నాయని భావిస్తున్నా.. కొత్తగా వస్తున్న పార్టీలు దీనిని తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. బీజేపీకి ప్రధాన ప్రయోజనం.. బీఆర్ ఎస్ ఓటు బ్యాంకే. గతం నుంచి ప్రస్తుతానికి జరుగుతున్న పరిణామాలను గమనిస్తే.. ఇది స్పష్టంగా కనిపిస్తోంది.అయితే.. కేంద్రం నుంచి రాష్ట్రానికి తగిన విధంగా సాయం లేకపోవడం, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా.. ప్రయోజనం కనిపించకపోవడంతో బీజేపీ ఓటు బ్యాంకు కూడా తగ్గుముఖం పడుతుందని అంటున్నారు. దీంతో కొత్తగా ఏర్పడుతున్న ఇతర పార్టీలు బీసీ, ఎస్సీ, మైనారిటీల ఓట్లను లక్ష్యంగా చేసుకుని సాగుతున్నాయి. ప్రత్యేక ఓటు బ్యాంకులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఓటర్లు అభివృద్ధి, ఉపాధి, పాలన తీరును బేరీజు వేసుకుని ఓటు వేస్తున్నారు.

ఇవీ కొత్త పార్టీలు..

తెలంగాణ రక్షణ సేన: కల్వకుంట్ల కవిత వ్యక్తిగత రాజకీయ ప్రయాణంలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. ఈ పార్టీ లక్ష్యం.. మెజారిటీ బీఆర్ ఎస్ ఓటు బ్యాంకును, మహిళా ఓటు బ్యాంకును సొంతం చేసుకోవడమే.

జన తెలంగాణ: కొత్త రాజకీయ ప్రత్యామ్నాయంగా ఏర్పడిన పార్టీని ప్రజాసంఘాల నాయకులు నడిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ ఉనికిని చాటుకునే ప్రయత్నాల్లో ఈ పార్టీ ఉంది.

ప్రజా పాలన పార్టీ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఏర్పాటు చేసిన ఈ పార్టీ కూడా పలు జిల్లాల్లో ఓటు బ్యాంకును ప్రభావితం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. భారతీయ యువజన పార్టీ, మజ్దూర్ జనతా పార్టీ, జన గళం పార్టీ, 'తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ వంటివి కూడా ప్రధాన పార్టీల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ.. వారి ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే.. ఇవి ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయం కాకపోయినా.. బలమైన ఓటు బ్యాంకును తమవైపు కొంతలో కొంత లాగేస్తే.. అది ఆయా ప్రధాన పార్టీలపై ప్రభావం చూపించడం ఖాయంగా కనిపిస్తోంది.

# మీడియా గుడ్డితనం పీక్స్ కు చేరుతోందా?

న్యూఢిల్లీ,గతానికి వర్తమానానికి మధ్య వ్యత్యాసం అంతకంతకూ పెరుగుతోందా? ప్రశ్నించాల్సిన మీడియా తన కనీస బాధ్యతను మర్చిపోతుందా? సొంతంగా శోధించే గుణాన్ని కోల్పోతుందా? ప్రభుత్వాలు అధికారికంగా ఏదైనా చెబితే గుడ్డిగా ఫాలో కావటం.. వారు చెప్పే గొప్పలకు డప్పు కొట్టే తీరు అంతకంతకూ ఎక్కువ అవుతుందా? ప్రభుత్వ విధానాల్ని ప్రశ్నించే కన్నా.. వారు కల్పించుకునే హైప్ కు తాను భాగస్వామి అవుతుందా? ఇదంతా ఎందుకు జరుగుతోంది? తమకు వచ్చిన సమాచారంపై కనీస ప్రశ్నల్ని తనను తాను సంధించుకునే శక్తిని మీడియా మిస్ అవుతుందా? అంటే అవునన్న చేదు నిజాన్ని ఒప్పుకోవాల్సిన దుస్థితి.గడిచిన కొన్నేళ్లుగా ఈ తీరు పెరుగుతోంది. మీడియా సంస్థల్ని సమాజానికి మేలు చేసేలా.. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కన్నా.. దాన్నో వ్యాపారంగా చూసే ధోరణి పెరిగిన కొద్దీ ప్రశ్నించే తత్త్వం.. ప్రజలకు జవాబుదారీగా ఉండే లక్షణాన్ని కోల్పోతున్న దుస్థితి. అది కేంద్ర ప్రభుత్వమైనా.. రాష్ట్ర ప్రభుత్వమైనా మీడియా తీరు మాత్రం ఒకేలా ఉంటోంది. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలు చేసుకునే ప్రచారానికి తానా అంటే తందానా అన్న రీతిలో సాగుతుండటంతో.. ప్రజలకు చేరాల్సిన సమాచారం చేరకపోవటమే కాదు.. నిజాలు మరుగున పడిపోతున్న వైనం కనిపిస్తుంది.ఈ రోజు జాతీయ.. ప్రాంతీయ దినపత్రికలను చూస్తే..ఒక వార్త ప్రముఖంగా కనిపిస్తుంది. అదేమంటే.. దేశంలోనే తొలి ఎల్ఎన్ జీ రైలును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారని. భారతీయ రైల్వే రూపాంతరం చెందుతూ.. మరింత ఆధునికీకరణ సంతరించుకుంటుందన్న మాటను చెబుతూ.. రైల్వేల గొప్పతనాన్ని కీర్తించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించాయి. అందుబాటులో ఉన్న సాంకేతికత ఆధారంగా.. ఈ గొప్పల్ని కాస్తంత క్రాస్ చెక్ చేస్తే.. ప్రభుత్వాలు చెప్పే మాటల్లోని బడాయితనం ఇట్టే కనిపిస్తుంది.ఇంతకూ అమిత్ షా చెప్పిందేంటి? ఈ ఎల్ఎన్ జీ రైలు ఏమిటి? దీని సాంకేతికత ఏంటి? ప్రపంచంలో ఈ సాంతికేత ఎప్పుడు అందుబాటులోకి వచ్చింది? ఏ దేశం దీన్ని తొలిసారి ఫాలో అయ్యింది? భారత్ కు ఎన్ని సంవత్సరాల తర్వాత ఈ టెక్నాలజీని వాడుతున్నారు? ఇప్పుడే ఎందుకు? అన్నింటికి మించి.. ఈ తరహా టెక్నాలజీని దేశంలోని ఎంత శాతం ట్రాక్ కు వినియోగించనున్నారు? నిజానికి ఇదంత గొప్ప విషయమా? మోడీ సర్కారు సాధించిన భారీ విజయమా? లాంటి ప్రశ్నలను వేసుకుంటూ.. వీటికి సంబంధించిన సమాధానాల్ని వెతికితే.. షాకింగ్ నిజాలే కాదు.. విస్మయానికి గురి చేసే వాస్తవాలు కళ్ల ముందుకు వస్తాయి.తొలుత దేశంలోని తొలి ఎల్ఎన్ జీ రైలు గురించి.. దాని గొప్పతనం గురించి.. ఆ రైలును ఎప్పుడు.. ఎక్కడ.. ఎవరు స్టార్ట్ చేశారు? ఈ ప్రారంభోత్సవ వేళలో అమిత్ షా ఏం చెప్పారన్నది సింపుల్ గా చూసి.. తర్వాత అసలు విషయంలోకి వెళితే.. 'విషయం' అర్థమవుతుంది. ప్రత్యామ్నాయ ఇంధన ఆధారిత ట్రైన్ల జాబితాలోకి లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) ఎల్ ఎన్ జీ రైలు అందుబాటులోకి వచ్చేసింది. గుజరాత్ లోని సబర్మతి రైల్వేస్టేషన్ లో ఈ సరికొత్త రైలును కేంద్ర హోం మంత్రి అమిత్ షా జెండా ఊపి ప్రారంభించారు. డీజిల్ వినియోగాన్ని తగ్గించి.. ఇంధన ఖర్చుల్లో పొదుపు చేసేందుకు ఈ తరహా రైళ్లు సాయం చేస్తాయని చెబుతున్నారు. కాలుష్య ఉద్గారాలను నియంత్రించే లక్ష్యంలో భాగంగా పలు ప్రత్యేకతలతో ఈ రైలును భారతీయ రైల్వే వ్యవస్థలో ప్రవేశ పెట్టినట్లుగా పేర్కొన్నారు.ఈ రైలు ఇంజిన్ ప్రత్యేకత ఏమంటే.. లభ్యతకు అనుగుణంగా ఎల్ ఎన్ జీ లేదా డీజిల్ తోనూ ఇది పని చేస్తుంది. అంటే డ్యూయల్ ఫ్యూయల్ ఇంజిన్ అన్న మాట. 8 కోచ్ లు ఉన్న నాన్ ఏసీ ఛైర్ కారును సబర్మతి - మహేసన జంక్షన్ వరకు నడిపారు. దీని రెగ్యులర్ రూట్ ఇంకా ఫైనల్ చేయలేదు. ఇప్పటికే వినియోగంలో ఉన్న 1400 హెచ్ పీ సామర్థ్యం కలిగిన రెండు డ్రైవింగ్ పవర్ కార్లను ఎల్ ఎన్ జీ డ్యూయల్ ఇంధన వ్యవస్థకు అనుగుణంగా మార్పులు చేశారు. దీంతో సాంప్రదాయక డీజిల్ వినియోగాన్ని 40 శాతం తగ్గించొచ్చన్నది ఒక అంచనా.ఈ ట్రైన్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రసంగించిన అమిత్ షా.. భారత ప్రధాని నరేంద్ర మోడీ భారత రైల్వే వ్యవస్థను పూర్తిగా మార్చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ తన పాలనలో రూ.12 లక్షల కోట్లకు పైగా మోసాలు.. అవినీతి.. కుంభకోణాలకు పాల్పడిందే తప్పించి ఇంకేం చేయలేదన్నారు. ఇప్పటికే హైడ్రోజన్ రైలును (రెండు నెలల క్రితం) ప్రారంభించుకోగా.. తాజాగా ఎల్ ఎన్ జీ రైలును అందుబాటులోకి తీసుకొచ్చిన వైనాన్ని అమిత్ షా గొప్పలు చెప్పుకున్నారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పిన మాటల్ని చదివేశారు కదా? ఇప్పుడు వాస్తవాల్లోకి వెళదాం. ఈ తరహా టెక్నాలజీ ప్రపంచానికి ఎప్పుడు పరిచయమైంది? అలా మొదలుపెట్టిన దేశం ఏది? ఇప్పుడు ఈ తరహా సాంకేతికతను వినియోగిస్తున్న దేశాలేంటి? అన్న ప్రశ్నలకు సమాధానాల్ని తెలుసుకుందాం. ఎల్ఎన్ జీ టెక్నాలజీతో రైళ్లను నడుపుతున్న దేశాలు చాలా పరిమితం. ఇంకాస్త స్పష్టంగా చెప్పాలంటే ఈ సాంకేతికతో రైళ్లునడుపుతున్న దేశాలు అరడజను మాత్రమే. అందులోకి తాజాగా భారత్ వచ్చి చేరింది. ఈ టెక్నాలజీని ప్రపంచానికి పరిచయం చేసింది రష్యా. ముఖ్యంగా భారీ సరుకు రవాణా కోసం వీటిని రూపొందించారు. అది కూడా




ఎప్పుడో తెలుసా?.. 1980చివర్లో.అయితే.. అప్పట్లో తొలిసారి తీసుకొచ్చిన ఇంజిన్ కు ఇప్పటి ఇంజిన్ కు చాలానే మార్పులు ఉన్నాయి. కాకుంటే.. లోకో మోటివ్ ఇంజిన్లను ఎల్ఎన్ జీ తో నడిచేలా డిజైన్ చేసి.. సక్సెస్ ఫుల్ గా నడిపారు. అయితే.. వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకొచ్చింది మాత్రం 1992-1993 మధ్య కాలంలో. సంప్రదాయ డీజిల్ వాడకానికి ఫుల్ స్టాప్ పెట్టి.. పర్యావరణహితంగా మారేందుకు వీలుగా అమెరికా.. రష్యాలు ఈ టెక్నాలజీకి పెద్దపీట వేశాయి. దాదాపు నలభై ఏళ్ల క్రితం నాటి టెక్నాలజీ గురించి ఇప్పుడు గొప్పగా చెప్పుకోవటం ఏమిటి? అయినా.. ఇప్పుడే భారత్ వీటి వైపు మొగ్గు చూపుతోంది? అన్న ప్రశ్నలు సహజంగా వస్తాయి.మొదట్లో భారత రైల్వేస్ తన ఫోకస్ మొత్తాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న రైల్వే నెట్ వర్క్ ను విద్యుద్దీకరణ మీదనే పెట్టింది. ప్రస్తుతం దేశంలో అందుబాటులో ఉన్న బ్రాడ్ గేజ్ రైల్వే నెట్ వర్క్ లో 99.6 శాతం విద్యుద్దీకరణను పూర్తి చేసింది. విద్యుత్ లైన్లు లేని మిగిలిన కొన్ని రూట్లలోనూ.. అత్యవసర సమయాల్లో వాడేందుకు మాత్రమే డీజిల్ రైళ్లు ఉన్నాయి.అయితే.. ఈ డీజిల్ వినియోగాన్ని 2030 నాటికి జీరో స్థాయికి తీసుకెళ్లేందుకు వీలుగా ఈ టెక్నాలజీని భారత రైల్వేస్ ఇప్పుడు అందిపుచ్చుకుంది.1988లో రష్యా వాడిన టెక్నాలజీలో గ్యాస్ లీకేజీ లాంటి భద్రతా లోపాలు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు వాటిని అధిగమించిన పరిస్థితి. ఇప్పుడు భారత రైల్వేస్ వాడుతున్న సాంకేతికత అప్డేటెడ్ గా చెప్పాలి. ఇది గ్యాస్ ను డీజిల్ గా మార్చేస్తుంది. ఈ టెక్నాలజీతో కలిగే ప్రయోజనం ఏమంటే.. పాత డీజిల్ ఇంజిన్లను పూర్తిగా పక్కన పడేయకుండా వాటిని తక్కువ ఖర్చుతో ఎల్ ఎన్ జీ ఇంజిన్లుగా మార్చేయటం ద్వారా ఖర్చు తగ్గటమే కాదు.. విద్యుద్దీకరణ లేని 0.4 శాతం బ్రాడ్ గేజ్ లైన్లలో వీటిని వినియోగించే వీలు ఉంటుంది. డీజిల్ భారాన్ని.. కాలుష్యాన్ని తగ్గించే వీలు కలుగుతుంది.ఈ ఏడాది జులైలో హైడ్రోజన్ రైళ్లను విజయవంతగా తీసుకొచ్చింది. కానీ.. దీని టెక్నాలజీ చాలా ఖరీదైనది. కాకుంటే సంప్రదాయ డీజిల్ నుంచి ఎల్ఎన్ జీ టెక్నాలజీని వినియోగించటం ద్వారా ఏడాదికి ఒక రైలుకు రూ.24 లక్షలు ఆదా చేస్తుంది. అదే సమయంలో కాలుష్యాన్ని 40 శాతం తగ్గించే వీలుంది. ఇదంతా డీజిల్ ఇంజిన్ వినియోగంతో లెక్కేసినప్పుడే అన్న విషయాన్ని మర్చిపోకూడదు. ఇప్పటికిప్పుడు హైడ్రోజన్ రైళ్లను భారీగా అందుబాటులోకి తెచ్చే పరిస్థితి భారత్ కు లేదు. అందుకు కొంత సమయం పట్టొచ్చు. ఇలాంటి వేళ.. మధ్యేమార్గంగా ఈ టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా.. ఇప్పటికే ఉన్న డీజిల్ ఇంజిన్ ను అప్ గ్రేడ్ చేసుకోవటం కాస్తంత కలిసి వచ్చే అంశం.నిజానికి ఎల్ఎన్ జీ టెక్నాలజీతో నడిచే రైళ్లతో పోలిస్తే.. ఎలక్ట్రిక్ రైళ్లు చాలా చౌకగా.. ఎక్కువ వేగంతో.. వంద శాతం కాలుష్యరహితంగా నడుస్తాయి. ఎల్ఎన్ జీ రైళ్లను నడపటానికి ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులకు చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఎందుకంటే సహజవాయువును ద్రవరూపంలో ఉంచటానికి మైనస్ 162 సెల్సియస్ ఉష్ణోగ్రత అవసరమన్నది మర్చిపోకూడదు. అంతేకాదు.. ఎల్ఎన్ జీ ధరలు అంతర్జాతీయ మార్కెట్ ధరల మీద ఆధారపడి ఉంటాయి. రష్యా - ఉక్రెయిన్ యుద్ధాల్లాంటి పరిస్థితుల్లో దీని ధరలు మరింతగా పెరుగుతాయి. ఇలా గ్యాస్ మీద ఆధారపడి రైళ్లను నడపటం సురక్షితం కాదన్న ఉద్దేశంతో ప్రపంచంలోనిచాలా దేశాలు ఈ టెక్నాలజీకి దూరంగా ఉంటాయి.కాకుంటే.. మన దగ్గర ఉన్న డీజిల్ ఇంజిన్లు.. అదే సమయంలో విద్యుద్దీకరణకు వీలుగా లేని రూట్లు (0.4 శాతం మొత్తం బ్రాడ్ గేజ్ లో) ఈ టెక్నాలజీతో ఉన్న ఇంజిన్లు వినియోగించేందుకు మాత్రమే వీలవుతుంది. పలు పాశ్చాత్య దేశాలు కాస్త ఖర్చు ఎక్కువే అయినా బ్యాటరీ.. హైడ్రోజన్ రైళ్ల మీద ఫోకస్ చేస్తున్నాయి. దేశంలో కరెంట్ లైన్లు లేని 0.4 శాతం రూట్లకు మాత్రమే ఈ ఇంజిన్లు ఉపయోగపడతాయి. ఇవి సుదూర ప్రాంతాలకు కాకుండా.. నగరాల మధ్య తక్కువ దూరం ఉండే రూట్లకు సెట్ అవుతాయి. ఒక్కసారి ఈ రైలులో ఇంధనాన్ని నింపితే ఏకధాటిగా 1600-2000 కి.మీ. ప్రయణించే వీలుంది. చిన్న రూట్లలో అయితే.. వారానికి ఒకసారి ఇంధనం నింపితే సరిపోతుంది.ఇదంతా చదివిన తర్వాత కలిగే సందేహం ఏమంటే.. చాలా పరిమిత అవసరాల కోసం వినియోగించే ఈ తరహా రైళ్లను కేంద్ర హోం మంత్రి ప్రారంభించటం.. దానికి

# అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు

హైదరాబాద్, తెలంగాణలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జీవో నెం.455, 456, 747, 92 కింద ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హమైన కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మరోవైపు 22ం భూముల సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. జీవో 118, 76కు అనుగుణంగా చర్యలు చేపట్టామని, మిగిలిన సమస్యలను కూడా వేగంగా పరిష్కరిస్తామని వెల్లడించింది.రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తులను పరిశీలించి, అర్హమైన కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. జఒఅ పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వుల అమలులో జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. 2016లో జీవోలు జారీ చేసినప్పటికీ అప్పట్లో వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం తాజాగా మెమో నెం.48062 జారీ చేసినట్లు వ

# కాపులకు వైసీపీ గాలం...




విజయవాడ,ఏపీ రాజకీయాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ తన ఉనికిని చాటుకోవడానికి, కూటమి ఐక్యతను దెబ్బతీయడానికి అనేక మార్గాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగానే రాబోయే రోజుల్లో కూటమిలోని కీలక భాగస్వామి అయిన జనసేనను, దాని మూలస్తంభమైన సామాజికవర్గాన్ని టార్గెట్ చేయడం ఒక వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారింది.తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో చోటుచేసుకున్న వంగవీటి రంగా విగ్రహ వివాదం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. నియోజకవర్గ పరిధిలోని స్థానిక సెంటిమెంట్లను రగిల్చి, దాని ద్వారా కూటమిలోని పార్టీల మధ్య ? ప్రత్యేకించి టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య ? అపోహలు సృష్టించేందుకు వైసీపీ సిద్ధం చేసిన ఒక రాజకీయ ప్రణాళిక అని జరిగిన దాన్ని బట్టి చూస్తే అర్థమైపోతుంది.ఏదైనా ప్రాంతంలో విగ్రహాల ఏర్పాటుకు స్థానిక పరిపాలనా అనుమతులు తప్పనిసరి. కానీ, స్థానిక అధికారులు మంత్రి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకునే లోపే, అనుమతుల కాలయాపనను నెపంగా చూపి రాత్రికి రాత్రే విగ్రహాన్ని పెట్టేయడం వెనుక స్పష్టమైన ఉద్దేశం కనిపిస్తోంది. విగ్రహం తొలగింపు పరిణామాలను తమ రాజకీయ లబ్ధికి వాడుకోవాలనేది ఇక్కడ వ్యూహం. ఈ క్రమంలోనే రాజకీయ అరంగేట్రం కోసం వేచి చూస్తున్న వంగవీటి ఆశాకిరణ్ వంటి నాయకులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని భావోద్వేగపూరితమైన వ్యాఖ్యలు చేయడం, రాజకీయాన్ని తీవ్రతరం చేయడం గమనార్హం. ప్రజా సమస్యలపై కాకుండా విగ్రహ రాజకీయాలపై ఆత్రుత చూపడం వెనుక ఉన్న స్వార్థం ప్రజలకు స్పష్టంగానే అర్థమవుతోంది.ఈ ఉదంతం వెనుక ఉన్న ప్రధాన కుట్ర కూటమిలోని జనసేన ఓటు బ్యాంకును వేరు చేయడం. టీడీపీ పాలన వల్ల రంగా విగ్రహానికి అన్యాయం జరిగిందనే ప్రచారాన్ని హోరెత్తించడం ద్వారా ఆ వర్గం యువతలో అసంతృప్తి రగల్చాలని వైసీపీ భావిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందనే నిజాన్ని మరిపించి, కేవలం కుల కోణాన్ని మాత్రమే ముందుకు నెట్టడం ద్వారా జనసేనకు లభించే సామాజిక మద్దతును బలహీనపరచడమే దీని అంతిమ లక్ష్యం. కాపు సెంటిమెంట్‌ను జనసేన నుండి వేరు చేస్తే తప్ప, ఆ పార్టీ రాజకీయ బలహీనత సాధించలేమనే అంచనాతోనే వైసీపీ ఈ రకమైన వ్యూహాలకు పదును పెడుతోంది.రాజకీయంగా ఇప్పుడిప్పుడే ప్రాధాన్యత పొందుతూ, సమ్మిళిత అధికారంలో కీలక పాత్ర పోషిస్తున్న ఒక వర్గానికి లేదా పార్టీకి ఇలాంటి వివాదాలు పెద్ద అగ్నిపరీక్ష వంటివి. అధికారంలో ఉన్నప్పుడు ఏ కొద్దిపాటి తొందరపాటు లేదా అతిగా స్పందించే ధోరణి కనిపించినా, అది ఇతర వర్గాల్లో ప్రతికూల భావన పెరిగేలా చేస్తుంది. తాము అధికారంలో ఉన్నామన్న భావనతో క్షేత్రస్థాయి శ్రేణులు సంయమనం కోల్పోతే, అది మిగిలిన సామాజికవర్గాలను దూరం చేసే ప్రమాదం ఉంది. ప్రత్యర్థులు పన్నిన ఈ కుల రాజకీయ వలలో చిక్కుకోకుండా ఉండాలంటే, భావోద్వేగాల కంటే పరిపక్వతతో కూడిన నిశ్శబ్ద వ్యూహం చాలా అవసరం.వైసీపీ విసిరిన ఈ విగ్రహ రాజకీయం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సింది కూటమి నాయకత్వమే. చిన్న విషయాలను సైతం పెద్ద వివాదాలుగా మార్చేందుకు ప్రతిపక్షం సిద్ధంగా ఉందనే వాస్తవాన్ని గుర్తించాలి. అధికారంలో ఉన్న పక్షాలు ముందస్తుగా చట్టబద్ధమైన పరిష్కారాలు చూపాలి తప్ప, వివాదాలు పెరిగే వరకు వేచి చూడకూడదు. కాపు ఓటు బ్యాంకుతో పాటు ఇతర వర్గాల మద్దతును సమతుల్యంగా కాపాడుకోవాలంటే, జనసేన శ్రేణులు తీవ్ర సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, ప్రత్యర్థులు ఆశించినట్లుగానే సామాజిక సమీకరణాలు దెబ్బతిని, అంతిమంగా రాజకీయంగా ఎదిగుతున్న వర్గానికే కోలుకోలేని నష్టం జరుగుతుంది. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయన్న సంగతిని ఎవరూ మర్చిపోకూడదు.

# గజ్వేల్ ఇంటికి ఎందుకు దూరం



మెదక్, సెప్టెంబర్ 30, తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు నిత్యం కెసిఆర్ చుట్టూ తిరుగుతుంటాయి. అది వివాదం కావచ్చు.. నినాదం కావచ్చు.. ఎన్నిక కావచ్చు.. ఓటమి కావచ్చు.. గెలుపు కావచ్చు. కెసిఆర్ ప్రస్తావన లేకుండా.. కెసిఆర్ పేరు లేకుండా తెలంగాణ రాజకీయాలు ఇప్పట్లో సాగే పరిస్థితి లేదు. భవిష్యత్ కాలంలో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది కావచ్చు.కెసిఆర్ సాజంగానే భారీతనాన్ని ఇష్టపడుతుంటారు. అప్పట్లో సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్న ఎన్వి రమణ.. కెసిఆర్ ది పెద్ద చెయ్యి అని వ్యాఖ్యానించారు. ఆయన ఏం చేసినా సరే అలానే ఉంటుందని పేర్కొన్నారు. ఆయన మాటలకు తగ్గట్టుగానే కేసీఆర్ ఏం చేసినా సరే అలానే ఉంటుంది. అయితే కొన్ని విషయాలు మాత్రం కెసిఆర్ చేసిన భారీతనమే ఆయనకు ఇబ్బందిగా మారింది. వాస్తవానికి కెసిఆర్ ఇలా చేస్తారని.. ఇలాంటి విమర్శలు ఎదుర్కొంటారని గులాబీ పార్టీ నాయకులు కలలో కూడా ఊహించి ఉండరు.కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలకు క్యాంపు ఆఫీసులు నిర్మించారు. ఇందులో కేసీఆర్ ప్రాతినిధ్యం వహించే గజ్వేల్ కూడా ఒకటి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గజ్వేల్ ప్రాంతంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నిర్మించారు. ఆ క్యాంప్ ఆఫీస్ నిర్మించి ఇప్పటికీ దాదాపు తొమ్మిది సంవత్సరాలు దాటింది. ఇంతవరకు ఒక్కసారి కూడా అందులోకి ఆయన ప్రవేశించలేదు. కార్యాలయం ప్రారంభోత్సవంలో కూడా పాల్గొనలేదని అక్కడి ప్రజలు చెబుతున్నారు.. ఎంతో ఇష్టపడి కట్టించుకున్న క్యాంప్ ఆఫీస్ లోకి కెసిఆర్ ఎందుకు వెళ్లలేదనేది ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్న. వాస్తును విపరీతంగా నమ్మే కెసిఆర్ ఇలా చేయడం ఏంటో అర్థం కావడం లేదని అక్కడి ప్రజలు అంటున్నారు. ఇప్పుడంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఒకప్పుడు మాత్రం కేసీఆరే కదా ముఖ్యమంత్రిగా ఉంది.. పైగా ఆయన గజ్వేల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నారు. అలాంటప్పుడు క్యాంప్ ఆఫీస్ లో ఉండడానికి ఇబ్బంది ఏముందని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు.కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాదాపు 350 కోట్లు ఖర్చుపెట్టి ప్రగతి భవన్ నిర్మించారు. ఆయన తక్కువసార్లు మాత్రమే ప్రగతి భవన్ లో ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన అప్పుడప్పుడు మాత్రమే అందులో ఉండేవారు. ఎక్కువసార్లు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాత్రమే ఉండేవారు. అది కూడా గజ్వేల్ ప్రాంతానికి చాలా దగ్గర. అయితే ఆయన ఎప్పుడు కూడా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కు హాజరు కాలేదు. పాత సెక్రటేరియట్లో బ్రహ్మాండమైన భవనాలు ఉన్నప్పటికీ.. కరోనా సమయంలో వాటిని పడగొట్టారు. నూతన సచివాలయం నిర్మించారు. దానికోసం భారీగాన్ని ఖర్చు పెట్టారని అప్పట్లో వార్తలు వచ్చాయి. సెక్రటేరియట్ కి కూడా ఆయన ఎక్కువసార్లు రాలేదని కాంగ్రెస్ నాయకులు అంటుంటారు. ఇప్పుడు గజ్వేల్ కి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ కూడా.. ఆయన క్యాంప్ ఆఫీస్ కు రావడం లేదు.. ప్రజలను నేరుగా కలవడం లేదు. ఆయనకు అవసరమనుకుంటే తప్ప ప్రజలను కలవరని ఇక్కడి కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

# తెలంగాణకు వర్ష సూచన.. రానున్న రెండు రోజులు మోస్తరు వర్షాలు..

హైదరాబాద్,బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం, ఉత్తర-దక్షిణ ద్రోణి ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రాబోయే రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అధికారులు స్పష్టం చేశారు. కొన్ని చోట్ల గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఏ ఏ జిల్లాలకు వర్ష సూచన?- ఎల్లో అలర్ట్ జారీ:

వాతావరణ కేంద్రం విడుదల చేసిన వివరాల ప్రకారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు(ఎవశ్రీఖఅస్త్రుఱు ఝఱఅం) కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు అధికారుల నుంచి ఎల్లో అలర్ట్ జారీ అయ్యింది. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లోనూ అక్కడక్కడా జల్లులు పడే అవకాశముంది.

హైదరాబాద్ వాతావరణ శాఖ కీలక సూచనలు:

వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు, జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# మేడిగడ్డ పనులు మొదలు ఇక...



కరీంనగర్ సెప్టెంబర్ 30 ,తెలంగాణలో కొంతకాలంగా రగిలిపోతున్న ప్రధాన అంశాలలో మేడిగడ్డ ఒకటి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన బ్యారేజీలలో మేడిగడ్డ ఒకటి. అయితే ఇది కుంగిపోవడంతో రాజకీయ వివాదానికి దారితీసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్యాప్తునకు ఆదేశించింది. అయితే మేడిగడ్డను పునరుద్ధరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని, కేవలం బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా బద్నాం చేయడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. ఈ విమర్శలకు చెక్ పెడుతూ ఎట్టకేలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ దిశగా కీలక అడుగులు వేసింది.మేడిగడ్డ కుంగుబాటు కేవలం ఇంజనీరింగ్ వైఫల్యమా లేక రాజకీయ కుట్రల ఫలితమా అనే చర్చ గత రెండేళ్లుగా తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తోంది. బ్యారేజ్ కుంగిన వెంటనే ప్రతిపక్ష బీఆర్ఎస్ దీనిని కేవలం సాంకేతిక లోపంగా, ప్రకృతి విపత్తుగా అభివర్ణించింది. అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం దీనిని అవినీతి కట్టడంగా విమర్శించింది. బ్యారేజ్‌ను బాగుచేయకపోతే రాష్ట్రానికి తాగు, సాగునీటి కష్టాలు తప్పవంటూ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఒత్తిడి తెచ్చింది. అయినా ప్రాజెక్టు పునరుద్ధరణపై ఇన్నాళ్లూ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. అయితే ఇప్పుడు పునరుద్ధరణ పనులకు నడుం బిగించింది.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫార్సులు, ఐఐటీ బాంబే నిపుణులు, అంతర్జాతీయ కన్సల్టెన్సీల సాంకేతిక నివేదికల ఆధారంగా ప్రభుత్వం మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లకు కూడా సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికలను సిద్ధం చేసింది. బ్యారేజ్ మొత్తం వెడల్పు మేరకు ఎండ్ టు ఎండ్ డయాఫ్రమ్ వాల్ నిర్మించి, పునాది భద్రతను పటిష్టం చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా వరద ఉధృతిని నియంత్రించడానికి దిగువన ఉన్న స్టిల్లింగ్ బేసిన్‌లను బలోపేతం చేయనున్నారు. ఈ పనులను రాబోయే వర్షాకాలం లోపే.. అంటే 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. దెబ్బతిన్న నిర్మాణాలను పునరుద్ధరించడం సాంకేతికంగా క్లిష్టమైనప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా వెనుకంజ వేయబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉంది. మేడిగడ్డను వదిలేశారు.. రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవట్లేదు.. అనే బీఆర్ఎస్ విమర్శలకు ప్రభుత్వ నిర్ణయం గట్టి సమాధానం ఇస్తుంది. ప్రాజెక్టుల పునరుద్ధరణకు తాము వ్యతిరేకం కాదని, కేవలం అవినీతి బండారాన్ని బట్టబయలు చేయడమే తమ ఉద్దేశమని చాటిచెప్పినట్లయింది. ప్రజలకు ఉపయోగపడేలా శాశ్వత పరిష్కారాలు చూపుతున్నామని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి ఇది గొప్ప అవకాశంగా మారింది. రాజకీయ లబ్ధి కోసం కాలయాపన చేస్తున్నారన్న అపవాదును తొలగించుకోవడంలో రేవంత్ రెడ్డి సర్కార్ సఫలమైందనే చెప్పాలి

# భట్టి ఇంటి దగ్గర ఆందోళనా..



హైదరాబాద్, సెప్టెంబర్ 30 ,తెలంగాణ నూతన సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చాంబర్ కారిడార్ నిత్యం నిరసనలకు కేంద్రబిందువుగా మారింది. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ నిధుల విడుదల, చిన్న తరహా సివిల్ కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం రోజూ డజన్ల కొద్దీ బాధితులు ఆయన చాంబర్ వైపే పరుగులు తీస్తున్నారు. భద్రతా వలయం ఉండే సెక్రటేరియట్‌లో, అదీనూ ఆర్థిక మంత్రి శాఖాపరమైన విధుల్లో ఉండే కీలక ప్రాంతానికే బాధితులు నేరుగా వెళ్లి ధర్నాలకు దిగడం వెనుక కేవలం బిల్లుల ఆలస్యమేనా ఇంకా ఏమైనా గూడుపుఠాణి ఉందా అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.నిజానికి సచివాలయ నిబంధనల ప్రకారం.. పెండింగ్ బిల్లుల మంజూరు, రిటైర్మెంట్ గ్రాట్యుటీల చెల్లింపు అనేది ఒక నిర్దిష్టమైన శాఖాపరమైన ప్రక్రియ. ట్రెజరీ డిపార్ట్‌మెంట్ నుంచి కింది స్థాయి అధికారుల స్క్రూటినీ ద్వారా ఆన్‌లైన్‌లో కుబేర్, సీఎఫ్ఎంఎస్ సిస్టమ్స్ ద్వారా ఎలక్ట్రానిక్ ఆమోదం పొంది నిధులు విడుదలవుతాయి. ఏ ఆర్థిక మంత్రి కూడా ఇండివిడ్యువల్ కాంట్రాక్టర్ల లేదా ఉద్యోగుల బిల్లుల ఫైళ్లపై వ్యక్తిగతంగా సంతకాలు పెట్టి ట్రెజరీ కిందకి నిధులు విడుదల చేసే అధికారం ఉండదు. సాధారణంగా ఫైనాన్స్ క్లియరెన్స్ మొత్తం బడ్జెటరీ రిలీజ్ ఆర్డర్స్ ప్రాతిపదికన సాగుతుంది. అలాంటప్పుడు ఈ నిరసనకారులంతా నేరుగా మంత్రినే టార్గెట్ చేస్తూ చాంబర్ వద్దకు చేరుకోవడం పరిపాలనా నిబంధనలకే పెద్ద సవాలుగా మారింది.సచివాలయం కఠినమైన పాస్‌లు, ఐడీ కార్డులతో నడిచే రక్షిత ప్రాంతం. ప్రవేశ అనుమతి ఉన్నవారు మాత్రమే భట్టి చాంబర్ వరకు రాగలరు. అలా వచ్చిన వారు కేవలం మంత్రికి వినతిపత్రం ఇచ్చే నెపంతో గుమిగూడి, అక్కడే నిరసనలకు దిగడం పట్ల ప్రభుత్వంపై ఉద్దేశపూర్వక దాడి జరుగుతోందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ఆర్థిక పరిమితులు తీవ్రంగా దెబ్బతిన్నాయి అన్న సందేశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతిపక్షాలు వ్యూహాత్మకంగా గ్రౌండ్ వర్క్ చేస్తున్నాయనే విమర్శ ఉంది. ఈ నిరసనల ముసుగులో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఘోరమైన సంక్షోభంలో కూరుకుపోయిందనే ఇంప్రెషన్ క్రియేట్ చేయడానికి పక్కా ప్రణాళికతోనే ఇదంతా ప్రాజెక్ట్ చేస్తున్నారనే అభిప్రాయం సెక్రటేరియట్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.ఆర్థిక మంత్రిత్వ శాఖ సైతం క్రమబద్ధమైన చెల్లింపుల ప్రణాళికను అమలు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. గత ప్రభుత్వం వదిలివెళ్లిన వేల కోట్ల రూపాయల బకాయిల భారాన్ని ఒక్కసారిగా సర్దుబాటు చేయడం సవాలుగా మారినా, ప్రాధాన్యతా ప్రాతిపదికన బిల్లులను విడుదల చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఏది ఏమైనప్పటికీ, సెక్రటేరియట్ వంటి అత్యున్నత కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిరసనలు జరగడం, దాన్ని ఆర్థిక సంక్షోభపు ప్రాపగండగా మార్చడం రాబోయే రోజుల్లో రేవంత్-భట్టి ద్వయం ఎదుర్కొంటున్న ప్రధాన రాజకీయ పరీక్షగా మారబోతోంది.

# ఖైరతాబాద్ నుంచి జనసేన పోటీ...




హైదరాబాద్, సెప్టెంబర్ 30,హైకోర్టు తీర్పుతో దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటం, తెలంగాణ అసెంబ్లీ ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైంది. తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలక పాత్ర పోషిస్తామని, 2029 స్థానిక ఎన్నికలు, అసెంబ్లీ పోరులో గట్టిగా నిలబడతామని పవన్ కళ్యాణ్ ఇటీవల స్పష్టం చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్తలు, విద్యార్థి సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తూ జనసేన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ఇలాంటి సమయంలో ఖైరతాబాద్ ఉపఎన్నిక రూపంలో జనసేనకు మొదటి అసలైన పరీక్ష ఎదురైంది. పార్టీని తెలంగాణలో సీరియస్‌గా తీసుకోవాలంటే ఖైరతాబాద్ బరిలో నిలవడం తప్పనిసరి. బరి నుంచి తప్పుకుంటే ఆంధ్రకే పరిమితమైన పార్టీ అనే ముద్రను కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు మరింత గట్టిగా వేసే అవకాశం ఉంది.ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలో ఉన్నప్పటికీ, తెలంగాణ విషయంలో బీజేపీ శ్రేణులు ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ, ఉపఎన్నికల్లో ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని బిజెపి తెలంగాణ నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సమయంలో చివరి నిమిషంలో జనసేన తప్పుకుని బీజేపీకి మద్దతు ప్రకటించింది. కానీ ఈసారి కూడా అదే పునరావృతమైతే జనసేన ఇక్కడి క్షేత్రస్థాయి క్యాడర్‌ను తీవ్రంగా నిరాశపరిచినట్లవుతుంది. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నారు. ఖైరతాబాద్ బరిలో స్వయంగా అభ్యర్థిని దింపితే, బీజేపీతో గ్యాప్ వచ్చే ప్రమాదం ఉంది. పోనీ అభ్యర్థిని నిలబెట్టకుండా బీజేపీకి మద్దతు ప్రకటించి సైలెంట్ అయిపోదామంటే, పొత్తులు వద్దంటున్న బిజెపికే బలవంతంగా మద్దతు ఇస్తున్నారా అనే విమర్శలు ఇతర పార్టీల నుంచి వస్తాయి. అందువల్ల ఉపఎన్నికలో పోటీ చేయడం ద్వారా తెలంగాణలో తమ స్వతంత్ర ఉనికిని చాటుకోవాలా లేదా సంయమనం పాటించాలా అనే ధర్మసందేహంలో పవన్ కళ్యాణ్ ఉన్నారు.హైదరాబాద్ నగరంలో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఆంధ్ర మూలాలు ఉన్న ఓటర్లు , అలాగే పవన్ కళ్యాణ్‌కు విశేషమైన అభిమాన గణం, యువత, బీసీ ఓటు బ్యాంకు గణనీయంగా ఉంది. పవన్ ప్రచారానికి వస్తే ఆ ప్రభావం ఖచ్చితంగా ఓట్లపై పడుతుంది. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లపై అసంతృప్తిగా ఉండి, సాంప్రదాయకంగా బిజెపికి పడని ఓటర్లను ఆకర్షించే అవకాశం జనసేనకు ఉంది. ఖైరతాబాద్ వంటి కీలక స్థానంలో పోటీ చేయాలంటే కేవలం గ్లాస్ గుర్తు ఉంటే సరిపోదు.. గట్టి ఆర్థిక, అంగ బలం ఉన్న అభ్యర్థి కావాలో. స్థానికంగా బలం ఉన్న శ్రేణులను లేదా ఇతర పార్టీల నుంచి అసంతృప్త నేతలను ఆకర్షించి అభ్యర్థిగా నిలబెడితేనే పోరు ఆసక్తికరంగా మారుతుంది. ఒకవేళ క్యాండిడేట్‌ను నిలబెడితే, పవన్ కళ్యాణ్ వచ్చి స్వయంగా ప్రచారం చేయాల్సిందే. అలా చేయని పక్షంలో క్యాడర్‌కి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కళ్యాణ్, తెలంగాణలో ప్రచారానికి వస్తే వచ్చే రాజకీయ పొలిటికల్ మైలేజ్ అంతాఇంతా కాదు.ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రకటనతో జనసేన ఒక కీలక మలుపు వద్ద నిలబడింది. పొత్తులతో సంబంధం లేకుండా పోటీ చేసి తమ నిజమైన ఓటు బ్యాంకు ఎంతో తేల్చుకోవడం ఒక మార్గమైతే, బీజేపీతో సామరస్యంగా చర్చించి ఏకాభిప్రాయానికి రావడం మరొక మార్గం. ఏది ఏమైనా, తెలంగాణలో తన 'సీరియస్‌నెస్'ను నిరూపించుకోవాలంటే పవన్ కళ్యాణ్ ఈ ఉపఎన్నికను తేలికగా తీసుకోలేరు. ఖైరతాబాద్ బరిలో జనసేన మార్క్ ఎలా ఉండబోతోందో రాబోయే కొన్ని రోజుల్లో తేలిపోనుంది.

# లిక్కర్ స్కామ్ గుట్టు దొరికేసింది...



హైదరాబాద్, సెప్టెంబర్ 30,వైఎస్సార్‌సీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్‌ను ఊపేసిన వేల కోట్ల లిక్కర్ స్కామ్ వ్యవహారంలో నాటి ప్రభుత్వం, అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. నాటి ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ కోర్టులో ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇప్పుడు పెను తుఫాను రేపుతోంది. మద్యంపాలసీ రూపకల్పన నుంచి మద్యం విక్రయాల వరకు అంతా నాటి సీఎంవో కనుసన్నల్లోనే, పూర్తి స్థాయి రాజకీయ ఒత్తిళ్ల మధ్యే జరిగిందని ఆయన న్యాయస్థానం ముందు నిజాలను పూసగుచ్చినట్లు వివరించారు. ఈ వాంగ్మూలంతో మద్యం స్కామ్ వెనుక అసలు సూత్రధారి నాటి ముఖ్యమంత్రి జగనేనన్న ఆరోపణలకు బలమైన సాక్ష్యం లభించినట్లయింది.రజత్ భార్గవ తన వాంగ్మూలంలో నాటి సీఎంవో అధికారుల పాత్రను బహిరంగంగా ఎండగట్టారు. ప్రవీణ్ ప్రకాష్, కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి వంటి అధికారులు సీఎంవో తరఫున ప్రత్యక్షంగా చక్రం తిప్పారని, తనకు , ఎక్సైజ్ శాఖ అధికారులకు నిరంతరం ఫోన్లు చేస్తూ తీవ్ర ఒత్తిడి తెచ్చారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తమకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చేలా జీవోలు ఇప్పించుకున్నారని స్పష్టం చేశారు. చివరికి ఎన్నికల సమయానికి ఈ భారీ కుంభకోణం బయటపడే ప్రమాదం ఉందని గ్రహించిన సీఎంవో పెద్దలు, స్కామ్ మొత్తాన్ని అధికారుల నెత్తిపై రుద్దేందుకు పక్కా ప్లాన్ వేశారని.. అయితే తాను మాత్రం చట్టవిరుద్ధమైన పత్రాలపై సంతకాలు చేయకుండా తప్పుకున్నానని కోర్టుకు వెల్లడించారు.ఇప్పటికే ఈ కేసులో మరో కీలక అధికారి సత్యప్రసాద్ కోర్టుకు వాంగ్మూలం ఇచ్చిన సమయంలో వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్రంగా స్పందించిన తీరు అందరికీ గుర్తుండే ఉంటుంది. అప్పట్లో సత్యప్రసాద్ మానసిక స్థితి సరిగా లేదని, ఆయనకు మెంటల్ సర్టిఫికెట్ ఉందంటూ తీవ్ర స్థాయిలో వ్యక్తిత్వ హననానికి దిగడమే కాకుండా మీడియా ముందే విమర్శలు గుప్పించారు. ఇప్పుడు రజత్ భార్గవ లాంటి సీనియర్ ఐఏఎస్ అధికారి కూడా నేరుగా సీఎంవో మరియు జగన్ రెడ్డి ఒత్తిళ్ల వల్లే అక్రమాలు జరిగాయని ఆధారాలతో సహా పూసగుచ్చినట్లు బయటపెట్టడంతో నాటి అధికార పార్టీ నేతలు డిఫెన్స్‌లో పడ్డారు.సత్యప్రసాద్ ఇచ్చిన వాంగ్మూలాన్ని తప్పించుకోవడానికి మెంటల్ డ్రామాలు ఆడిన వైఎస్సార్‌సీపీ నేతలు, ఇప్పుడు రజత్ భార్గవ ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఎలాంటి వికారపు వ్యాఖ్యలు చేస్తారోనని సర్వత్రా చర్చ నడుస్తోంది. ఐఏఎస్ అధికారులే స్వయంగా కోర్టులో సీఎంవో అక్రమాలను పూసగుచ్చినట్లు చెప్పడంతో, ఈ మద్యం కుంభకోణంలో అసలు నిందితులకు త్వరలోనే చట్టపరమైన ట్రీట్మెంట్ ప్రారంభం కానుంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న వైనం ఈ స్టేట్‌మెంట్‌తో స్పష్టంగా వెల్లడైంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140